

■ సెలవులో వెళ్లిన కలెక్టర్



అనంతపురం టౌన్, ఆగస్టు 22: కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ సెలవులో వెళ్లారు. కొంతకాలంగా జేసీ లేకపోవడంతో ఆయనే అన్నీ చూసుకుంటున్నారు. తాజాగా జేసీ శివనారాయణ శర్మ బాధ్యతలు స్వీకరించారు. దీంతో కలెక్టర్ వ్యక్తిగత పనిమీద మూడు రోజులపాటు సెలవు పెట్టారు. ఆయన అదివారం రాత్రి జిల్లాకు తిరిగి వస్తారు. సోమవారం కృష్ణాష్టమి.. ప్రభుత్వ సెలవు ఉంది. మంగళవారం విధుల్లో చేరుతారు. అప్పటి వరకూ ఇన్‌చార్జి కలెక్టర్‌గా జేసీ వ్యవహరిస్తారు.

గంగమ్మ పండుగ

- చెరువులకు భారీగా నీరు
- పరవళ్లు తొక్కుతున్న మరువలు



మరువ పారుతున్న శ్రీధరఘట్ట చెరువు

చెరువులు కళకళలాడుతున్నాయి. నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తోడు.. కొన్ని ప్రాంతాల చెరువులకు కృష్ణా జలాలు చేరుతున్నాయి. ఏళ్ల తరబడి చుక్క నీటికి నోచుకోని చెరువులు జలకళను సంతరించుకోవడంతో రైతులు సంబరపడిపోతున్నారు. సాగు, తాగునీటి సమస్య తీరుతుందని, వ్యవసాయ బోరుబావులు రీచార్జ్ అవుతాయని అంటున్నారు. జిల్లాలోని 31 మండలాల పరిధిలో 301 చెరువులు ఉండగా.. 116 చెరువులకు నీరు చేరింది. వీటిలో 21 చెరువులు పొంగి మరువ పారుతున్నాయి.




పీసీ ప్యాపిలి చెరువులోకి చేరిన వర్షపునీరు

ఉరవకొండ: బూదగవి చెరువుకు భారీగా వరదచేరడంతో మరువ పొంగి పొర్లింది. ఈ చెరువు కింద 70 ఎకరాల ఆయకట్టు ఉంది. వజ్రకరూరు మండలం ప్యాపిలి, పందికుంట తండా, జరుట్ల రాంపురం చెరువులు కూడా నిండాయి. పందికుంట తండా చెరువులోకి భారీగా వరదనీరు చేరింది. చెరువుగట్టు కోతకు గురైంది. ప్యాపిలి చెరువు రెండేళ్ల తరువాత నిండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



నిండుకుండలా శ్రీధరఘట్ట చెరువు

బొమ్మనహాళ్: శ్రీధరఘట్ట చెరువు నిండుకుండలా మారింది. ఈ ఏడాది రెండు పంటలకు సరిపడా నీరు చేరిందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చెరువు కింద 450 ఎకరాలకుపైగా ఆయకట్టు ఉంది. వరినాట్లు జోరందుకున్నాయి.



మరువ పారుతున్న కొత్తపల్లి చెరువు

కణేకల్లు: భారీ వర్షాలకు కొత్తపల్లి చెరువు నిండింది. ఈ చెరువు కింద దాదాపు 200 ఎకరాలు ఆయకట్టు ఉంది. చుట్టుపక్కల వందలాది వ్యవసాయ బోరు బావులు ఉన్నాయి. భూగర్భ జలాలు పెరుగుతాయని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



వర్షపు నీటితో కళకళలాడుతున్న కంబదూరు చెరువు

కళ్యాణదుర్గం: చోళుల కాలం నాటి కంబదూరు చెరువు కళకళలాడుతోంది. కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ఇది అతి పెద్ద చెరువు. చెరువు విస్తీర్ణం 1100 హెక్టార్లు కాగా.. 1560 ఎకరాల ఆయకట్టు ఉంది.



నిండుకుండలా..

బెళుగుప్ప: శీర్పి వద్ద ఉన్న బీజీగుండం చెరువు నిండుకుండను తలపిస్తోంది. రెండు దశాబ్దాల తరువాత మరువపారింది. రైతులు గురువారం గంగ పూజ చేశారు. ఆయకట్టు 104 ఎకరాలు ఉందని ఇరిగేషన్ అధికారి గురుప్రసాద్ తెలిపారు.



నిండిన యల్లనూరు చెరువు

యల్లనూరు: మండల కేంద్రంలోని రెండు చెరువులు నిండాయి. పాతచెరువు కింద 450 ఎకరాలు, కొత్త చెరువు కింద 300 ఎకరాల ఆయకట్టు ఉంది. భారీ వర్షాలతోపాటు ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణాజలాలు ఈ చెరువులకు చేరాయి. ఇప్పటికే రైతులు నారు మడులు సిద్ధం చేసుకున్నారు. కొత్తచెరువు కింద పూర్తిస్థాయి ఆయకట్టు సాగుచేయక పదేళ్లు గడిచింది. ఈసారి రైతులందరూ పంటల సాగుకు సిద్ధమయ్యారు.



ఆయకట్టు కింద సాగుచేసిన వరిపైరు



మరువ పారుతున్న మాముడూరు చెరువు

గుత్తి రూరల్: మండల పరిధిలోని మాముడూరు, బ్రహ్మణపల్లి, యర్రగుడి చెరువులు నిండి, మరవ పారుతున్నాయి. మాముడూరు చెరువు కింద 738 ఎకరాల ఆయకట్టు ఉంది. రెండేళ్ల తరువాత ఈ చెరువు నిడింది. కానీ ఆరేళ్లుగా ఆయకట్టు సాగు చేయలేదు. బ్రహ్మణ పల్లి చెరువు కింద 98 ఎకరాల ఆయకట్టు ఉంది. పదిహేనేళ్ల క్రితం ఆయకట్టు సాగు చేశారు. చివరిసారిగా 2014లో ఈ చెరువు నిండింది. యర్రగుడి చెరువు కింద 33 ఎకరాల ఆయకట్టు ఉంది. పదిహేనేళ్ల క్రితం చివరిసారిగా ఆయకట్టు సాగు చేశారు.



నిండిన బ్రాహ్మణపల్లి చెరువు

ఆ ఏడుగురి మాటేమిటి..?

- విధుల్లో చేరని తహసీల్దార్లు
- మార్పులు చేర్పులపై కలెక్టర్ మౌనం



సీఎస్ జారీ చేసిన కొత్త జీఓ

అనంతపురం టౌన్, ఆగస్టు 22: తహసీల్దార్ల పోస్టింగ్‌ల వ్యవహారం ఇంకా కొలిక్కి రాలేదు. జిల్లాలోని అన్ని మండలాలకు తహసీల్దార్లను కేటాయిస్తూ ఇటీవల కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఉత్తర్వులు ఇచ్చారు. వీరిలో ఏడుగురు ఇంకా విధుల్లో చేరలేదు. ఉత్తర్వులు ఇచ్చి 20 రోజులు గడిచినా.. వీరి సంగతేమిటో తేలడం లేదు. పోస్టింగ్‌ల జాబితాలో మార్పులు చేయకపోవడం, విధుల్లో చేరనివారి విషయంలో కలెక్టర్ మౌనంగా ఉండటం రెవెన్యూ వర్గాల్లో చర్చకు దారితీస్తోంది. తహసీల్దార్లు మోహన్‌కుమార్‌కు కూడేరు, ఈశ్వరమ్మకు తాడిపత్రి, అలెగ్జాండర్‌కు రాయదుర్గం, షర్మిలకు బెళుగుప్ప, వాణిశ్రీకి అనంతపురం రూరల్, ఉషారాణికి గుంతకల్లు ఆర్డీఓ కార్యాలయం కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. వీరు అక్కడ జాయిన్ కాలేదు. దీనికి స్థానిక ప్రజాప్రతినిధుల అయిష్టతే కారణమని ప్రచారం జరుగుతోంది. పోస్టింగ్ జాబితాలో మార్పులు, చేర్పులు ఉంటాయని, వీరిస్థానంలో కొత్త వారిని నియమిస్తారని అందరూ అనుకున్నారు. కానీ 20 రోజులు కావస్తున్నా ఏ మార్పులూ జరగలేదు.

మార్పులు తప్పవా?

తహసీల్దార్ల పోస్టింగ్‌ల విషయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ఇటీవల కొత్త జీఓ విడుదల చేశారు. ఆ ఉత్తర్వుల ప్రకారం ఉమ్మడి జిల్లాను ప్రాతిపదికగా తీసుకుని పోస్టింగ్‌లు ఇచ్చేందుకు వెసులుబాటు కల్పించారు. దీంతో అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలలో తహసీల్దార్ల పోస్టింగ్ జాబితాలో మార్పులు ఉంటాయని భావిస్తున్నారు. విధుల్లో చేరని ఏడుగురితోపాటు ఇప్పటికే విధుల్లో చేరిన తహసీల్దార్లు కొందరు ఆయా స్థానాలపై అసంతృప్తితో ఉన్నారు. మరికొందరిని నియోజకవర్గ ప్రజాప్రతినిధులు వ్యతిరేకిస్తున్నారు. పోస్టింగ్‌ల విషయంలో తమ అభిప్రాయం తీసుకోలేదని కలెక్టర్, అధికార పార్టీ సీనియర్ నేతల వద్ద ఓ మహిళా ప్రజాప్రతినిధి అసంతృప్తిని వ్యక్తం చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఆమె ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో కూడా ఒకరిద్దరిని మార్చే అవకాశం ఉందని అంటున్నారు. అదే నియోజకవర్గంలో పనిచేసే ఓ తహసీల్దారు తన స్థానం పట్ల అసంతృప్తితో ఉన్నారు. మార్పులు జరిగితే జిల్లాకేంద్రానికి దగ్గరలో ఉన్న బీకేఎస్, గార్లదిన్నె మండలాలలో ఏదో ఒకచోటుకు రావాలని చూస్తున్నారు. కలెక్టర్ శుక్రవారం నుంచి సెలవు పెట్టారు. ఆయన విధుల్లో చేరేదాకా సస్పెన్స్ తప్పదు.

చౌరబాటు పాపం వైసీపీదే..!

టీడీపీ హయాంలో టమోటా మార్కెట్ ఏర్పాటు

పంచాయతీకి భారీగా సమకూరిన ఆదాయం

వైసీపీ హయాంలో మాఫియా గుప్పిట్లోకి..



ఎన్నాళ్లీ దారిద్ర్యం..?

జాతీయ రహదారి 44.. కక్కలపల్లి క్రాస్ నుంచి కక్కలపల్లి వెళ్లే ప్రధాన రహదారి గుంతలమయమైంది. వర్షం కురిస్తే బురద మడిలా మారి.. ప్రమాదకరంగా తయారౌతోంది. మిగిలిన సమయాల్లో విపరీతమైన దుమ్ము రేగుతోంది. ఫలితంగా వాహనదారులు, మార్కెట్‌కు వచ్చేవారు, స్థానికులు, వ్యాపారులు రోగాలబారిన పడుతున్నారు. మార్కెట్ నుంచి 300 మీటర్లు రోడ్డు వేస్తే సమస్య పరిష్కారమౌతుంది. కానీ ఏళ్ల తరబడి ఆ సమస్య అలాగే ఉండిపోయింది. మార్కెట్‌ను పంచాయతీ అధీనంలోకి తీసుకుని, చట్టబద్ధంగా సుంకం వసూలు చేస్తే.. ఇలాంటి సమస్యలు అలవోకగా పరిష్కారమౌతాయి.

అనంతపురం రూరల్, ఆగస్టు 22: స్థానిక సంస్థలు ఎక్కడైనా.. ఆదాయన వనరులను మెరుగుపరుచుకుంటాయి. ఆ సొమ్ముతో అభివృద్ధి దిశగా అడుగులు వేస్తాయి. కానీ కక్కలపల్లి పంచాయతీ మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. ఏటా కనీసం అర కోటి ఆదాయం సమకూరే టమోటా మార్కెట్‌ను గాలికి వదిలేసింది. కోర్టులో వివాదం ఉందన్న సాకుతో పట్టించుకోవడం మానేసింది. దీంతో వైసీపీ హయాంలో మార్కెట్ కొందరి చేతుల్లో బందీ అయ్యింది. ఆదాయం పక్కదారి పట్టడం మొదలైంది. తాజా వివాదాలకు గత పాలకుల తీరే కారణమన్న విమర్శలు వస్తున్నాయి.

టీడీపీ హయాంలో..

కక్కలపల్లి టమోటా మార్కెట్ 2014-15లో ప్రారంభమైంది. ఒకటి రెండు మండీలతో మొదలై.. 30కి పైగా మండీలకు విస్తరించింది. పొరుగు జిల్లాల మార్కెట్‌లను తలదన్నేలా వ్యాపారం సాగుతోంది. మార్కెట్ ప్రారంభమైన రెండు మూడేళ్లకు పంచాయతీ అభివృద్ధి కోసం వాహనాల నుంచి సుంకం వసూలు చేయడం ప్రారంభించారు. వైసీపీ అధికారంలోకి వచ్చాక మార్కెట్ ఆ పార్టీ ప్రజాప్రతినిధుల చేతుల్లోకి వెళ్లిపోయింది. పంచాయతీ ఆధ్వర్యంలో సాగే సుంకం వేలం ప్రక్రియను అడ్డుకుని, తమ పరం చేసుకోవాలని ప్రయత్నించారు. వేలం ప్రక్రియలో స్థానికులే పాల్గొనాలనే నిబంధన ఉన్నింది. దాన్ని తుంగలోకి తొక్కేశారు. ఇతర ప్రాంతాల వారిని వేలంలోకి తీసుకొచ్చారు. ఈ క్రమంలో ఓ ఏడాది రూ.50 లక్షలు పలకాల్సింది.. తక్కువకే పోయింది. మునుపటి ఏడాది కంటే కేవలం రూ.40వేలు ఎక్కువకు పాడుకున్నారు. ఈ తరువాత ఏడాది స్థానికులు గట్టిగా పట్టు పట్టడంతో రూ.అర కోటి దాటింది. ఈ క్రమంలో సుంకం వసూలు వ్యవహారం కోర్టు పరిధిలోకి వెళ్లింది. అయినా సరే.. గత ఏడాది వేలం నిర్వహించకపోయినా, పంచాయతీ ప్రజాప్రతినిధులు, స్థానిక వైసీపీ నాయకుల ఆధ్వర్యంలో సుంకం వసూలు చేశారు. ఆ సొమ్ము ఎక్కడికి వెళ్లిందో తెలియదు. ఇప్పటికీ పంచాయతీలో వైసీపీ మద్దతు ప్రజా ప్రతినిధులే ఉన్నారు. పంచాయతీ అభివృద్ధిని కాంక్షించేవారే అయితే.. కోర్టులో కౌంటర్ దాఖలు చేయవచ్చు. కానీ పట్టించుకోవడం లేదని స్థానికులు విమర్శిస్తున్నారు.

భారీగా ఆదాయం

టమోటా మార్కెట్‌కు వచ్చి వెళ్లే వాహనాల నుంచి ఏటా టోల్ వసూలు చేసేవారు. గత ఏడాది నుంచి ఈ ప్రక్రియ నిలిచిపోయింది. పంచాయతీ గణాంకాల ప్రకారం 2017లో వేలం ద్వారా రూ.9 లక్షల ఆదాయం సమకూరింది. 2018లో రూ.17.01 లక్షలు, 2019లో రూ.30.01 లక్షలు, 2020లో రూ.38.10 లక్షలు, 2021లో రూ.38.50 లక్షలు వచ్చింది. 2022లో ఏకంగా రూ.62.60 లక్షలు పలికింది. మార్కెట్ ద్వారా సమకూరే ఈ ఆదాయంతో పంచాయతీని, మార్కెట్‌ను అభివృద్ధి చేయొచ్చు. కానీ మార్కెట్‌ను అధికారులు మాఫియా గుప్పిట్లో పెట్టి.. చోద్యం చూస్తున్నారు. ఫలితంగా మార్కెట్ అక్రమాలకు నిలయంగా మారింది. రైతులు దగా పడుతున్నారు.



బురదమయమైన టమోటా మార్కెట్



వర్షపు నీరు వెళ్లేలా పనులు..



← పారవేసిన టమోటాలు

టమోటా పారబోత

రైతులు కష్టించి పండించిన టమోటా నేలపాలవుతోంది. మార్కెట్‌లో గిట్టుబాటు ధర లేకపోవడంతో సమీపంలోని ప్రధాన రోడ్డు పక్క పారబోస్తున్నారు. నాలుగైదు రోజులుగా మార్కెట్‌లో టన్నుల కొద్దీ టమోటా నోసేల్ కిందపడిపోతోంది. టమోటాను వెనక్కు తీసుకెళ్లలేక అక్కడే వదిలేస్తున్నారు. మరికొందరు ఇలా రోడ్డు పక్కన పారబోస్తున్నారు. గురువారం 65 టన్నుల టమోటా నో సేల్ కింద రోడ్డుపాలైంది.

రైతులకు సహకరిస్తాం

టమోటా మార్కెట్‌లో రైతులకు తమ వంతుగా సహకరిస్తామని ది లారీ ఓనర్స్ అసోయేషన్ అధ్యక్షుడు నీలకంఠనాయుడు అన్నారు. అసోసియేషన్ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. అసోసియేషన్‌కు రాజకీయాలతో సంబంధం లేదని అన్నారు. తమ సమస్యల పరిష్కారంకోసం అసోసియేషన్ ఏర్పాటు చేసుకున్నామని, రైతులకు వ్యతిరేకం కాదని అన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి అబ్దుల్ రజాక్, ఉపాధ్యక్షులు నారాయణస్వామి, శివ, గౌరవాధ్యక్షుడు సీనప్ప, కోశాధికారి నగేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇదిగో.. ఇలా జరిగింది ఘోరం..!





మహిళా డాక్టర్ హత్యను కళ్లకు కట్టినట్లు చూపిస్తూ ప్రేక్షకుల కళ్లలో నీళ్లు తెప్పించిన దృశ్యాలు





పీటీసీ మైదానంలో నాటక ప్రదర్శన

కోల్‌కతాలో హత్యాచారాన్ని కళ్లకు కట్టిన జూడాలు

కోల్‌కతా మెడికల్ కళాశాలలో పీజీ వైద్యురాలి హత్యాచార ఘటనను కళ్లకు కడుతూ.. జూడాలు నాటకాన్ని ప్రదర్శించారు. దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన ఆందోళనలో భాగంగా.. జిల్లా ఆస్పత్రిలో గురువారం రిలే దీక్షలు చేపట్టారు. వీరికి ఎన్‌జీఓ నాయకులు సంఘీభావం తెలిపారు. యువతులపై జరుగుతున్న అఘాయిత్యాలను కళ్లకు కడుతూ.. ప్రజలలో చైతన్యం తెచ్చేలా పీటీసీ మైదానంలో గురువారం రాత్రి నాటకాన్ని ప్రదర్శించారు. నైట్ డ్యూటీ సమయంలో కోల్‌కతా మెడికల్ కాలేజీలో వైద్యురాలిపై జరిగిన దాడి ఘటనను జూడాలు ప్రదర్శించడంతో వీక్షకులు కంటతడి పెట్టారు. నల్లదుస్తులు ధరించి.. జూడాలు, పీజీలు నాటక ప్రదర్శనలో పాల్గొన్నారు. వారి ప్రయత్నం వీక్షకులను ఆలోచింపజేసింది. - అనంతపురం టౌన్

అభివృద్ధి కోసమే గ్రామసభలు

కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్



గ్రామసభలపై ఆదేశాలిస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్

అనంతపురం టౌన్, ఆగస్టు 22: గ్రామాల అభివృద్ధి కోసం ప్రణాళికలను రూపొందించేందుకు అన్ని పంచాయతీలలో రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం గ్రామ సభలు నిర్వహిస్తోందని కలెక్టర్ వినోద్ కుమార్ అన్నారు. జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రజాస్వామ్య పద్ధతిలో సభలు నిర్వహించాలని, గ్రామాల అభివృద్ధికి ఏమేమి కావాలో తెలుసుకుని ప్రణాళికలు తయారు చేసి ప్రభుత్వానికి పంపాలని కలెక్టర్ సూచించారు. అధికారులు, ప్రజాప్రతినిధులను ఈ సభలలో భాగస్వామ్యం చేయాలని సూచించారు. సర్పంచ్ అధ్యక్షతన సభలు జరపాలని ఆదేశించారు. సభల మినిట్స్, ఫొటోలు, వీడియోలను ఈఎంఎంఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలని అన్నారు. ప్రభుత్వ పథకాలు, వర్షపు నీటి సంరక్షణకు సూచనలు ఇచ్చారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

జిల్లాలో బాల్య వివాహాలను అరికట్టడానికి ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కలెక్టర్ సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. బాల్య వివాహాలను ఆపిన తర్వాత వారికి విద్య, నైపుణ్య శిక్షణ ఇప్పించాలని, సొంతంగా బతికేలా చూడాలని అన్నారు. విద్యార్థినులకు బ్యాడ్ టచ్, గుడ్ టచ్ గురించి అవగాహన కల్పించాలని సూచించారు.

ఉచిత ఇసుక సరఫరాను
సమర్థవంతంగా అమలు చేయాలి

ఫిర్యాదుల స్వీకరణకు టోల్‌ఫ్రీ నంబర్: 08554-298380

కలెక్టర్ వినోద్‌కుమార్



అనంతపురం టౌన్, ఆగస్టు 22: జిల్లాలో ఉచిత ఇసుక సరఫరా ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను కలెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశించారు. సీఎస్ నీరబ్ కుమార్ జారీచేసిన ఉత్తర్వుల మేరకు గురువారం జిల్లా అధికారులకు ఆయన పలు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని అన్నిమండలాల ప్రత్యేక అధికారులు ఇసుక రీచ్‌లను, స్టాక్ పాయింట్లను స్వయంగా వెళ్లి పరిశీలించాలన్నారు. ఇసుక సరఫరా సక్రమంగా అమలయ్యేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. తాడిపత్రి మండలంలో గుర్తించిన 620 మెట్రిక్ టన్నుల ఇసుక అక్రమ నిల్వలపై ఎలాంటి చర్యలు తీసుకున్నారో వెంటనే నివేదికలు పంపాలని డీఎంజీఓను ఆదేశించారు. ఇసుక బుకింగ్ కోసం రాయదుర్గం తహశీల్దార్ కార్యాలయంలో ఒక అధికారికి బాధ్యతలు అప్పగించి ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. స్టాక్ పాయింట్ల వద్ద ట్రక్కులలోకి లోడ్‌చేయబోయే తేదీ, సమయం తప్పనిసరిగా పేర్కొంటూ రశీదులను జారీచేయాలన్నారు. ఇసుకరవాణా చేసే వాహనాలను కమిషనర్ అండ్ మైన్స్ జియాలజీ పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. ఉచిత ఇసుకకు సంబంధించిన కార్యకలాపాలకు ఇన్‌చార్జిగా తహసీల్దార్ ఉండాలన్నారు. ఇసుకరవాణాకు సంబంధించి రవాణాదారులు ఎలాంటి ఉల్లంఘనలకు పాల్పడినా సంబంధిత శాఖలు కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్టాక్ పాయింట్ల వద్ద అనవసరంగా ఒక్క వాహనం కూడా ఉండకూడదని హెచ్చరించారు. ఇసుక కార్యకలాపాలకు ఆటంకాలు కలగకుండా స్టాక్ పాయింట్లకు సమీపంలో చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆగస్టు 22: ఉమ్మడి అనంత జిల్లాల్లోని గిరిజన అభ్యర్థులకు నిర్వహించనున్న డీఎస్సీ ఉచిత కోచింగ్‌కు సంబంధించిన దరఖాస్తుల గడువు ఈ నెల 31 వరకు పొడిగించినట్లు సంక్షేమశాఖాధికారి రామాంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్టీ అభ్యర్థులు డిగ్రీ, బీఈడీ, ఈఈడీ, టెట్ పరీక్ష, వయస్సు, మెరిట్ ఆధారంగా దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందన్నారు. అర్హత ఉన్న అభ్యర్థులు దరఖాస్తులను ఈనెల 31వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు అనంతపురంలోని పెన్నార్‌భవన్‌లో ఉన్న గిరిజన సంక్షేమశాఖ కార్యాలయంలో అందజేయాలన్నారు.

25 మండలాల్లో వర్షం

అనంతపురం అర్బన్, ఆగస్టు 22: జిల్లాలోని 25 మండలాల్లో బుధవారం రాత్రి వర్షం కురిసింది. అత్యధికంగా బొమ్మనహాళ్‌లో 29.0 మి.మీల వర్షపాతం నమోదైంది. విడపనకల్లు 25.2, వజ్రకరూరు 23.2, రాప్తాడు 20.4, డీ. హిరేహాళ్ 18.0, పామిడి 15.2, బెళుగుప్ప 14.6, గుంతకల్లు 13.4, కూడేరు 11.4, కణేకల్లు 11.2, గుత్తి 8.8, గార్లదిన్నె 7.2, ఉరవకొండ 6.8, పెద్దపప్పూరు, ఆత్మకూరు 5.2, అనంతపురం 5.0 మి.మీ వర్షపాతం నమోదైంది. మిగతా మండలాల్లో 4.6 మి.మీలోపు వర్షపాతం నమోదైంది.

ఆహారశుద్ధి పరిశ్రమలకు ప్రోత్సాహం

జిల్లా ఉద్యాన శాఖాధికారి నరసింహారావు

అనంతపురం అర్బన్, ఆగస్టు 22: అనంతపురం ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో ఆహారశుద్ధికి సంబంధించి కుటీర పరిశ్రమల ఏర్పాటు కోసం రాయితీ ప్రోత్సాహకాలు అందిస్తున్నట్లు జిల్లా ఉద్యాన శాఖ అధికారి నరసింహారావు తెలిపారు. గురువారం స్థానిక ఉద్యాన శాఖ జిల్లా కార్యాలయంలో ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ జోనల్ మేనేజర్ అలెన్ మ్యాథ్యూతో కలిసి సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. ప్రధానమంత్రి ఆహారశుద్ధి క్రమబద్ధీకరణ ద్వారా 18 సంవత్సరాలు నిండిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, యువత, నిరుద్యోగులు, మహిళలు, రైతులు, స్వయంసహాయక సంఘాలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాల సభ్యులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. జిల్లాకు ఈ ఏడాది 310 టార్గెట్ ఇచ్చారన్నారు. ప్రాజెక్టు విలువలో లబ్ధిదారులు 10 శాతం భరిస్తే, 35 శాతం ప్రభుత్వం రాయితీ వర్తింపజేస్తుందన్నారు.

పనుల వివరాలు నమోదు చేయించాలి

టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్

అనంతపురం అర్బన్, ఆగస్టు 22: జిల్లావ్యాప్తంగా శుక్రవారం నిర్వహించే గ్రామసభల్లో ఆయా గ్రామాల్లో జరగాల్సిన అభివృద్ధి పనులు నమోదు చేయించాలని టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని పంచాయతీల్లో గ్రామ అభివృద్ధి పనులు గుర్తించేందుకు ప్రభుత్వం పెద్దఎత్తున గ్రామ సభలు నిర్వహిస్తోందన్నారు. ఈ సభలకు పార్టీ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు, గ్రామ ముఖ్యనాయకులు హాజరై ఆయా ప్రాంతాల్లో చేయాల్సిన పనులను నమోదు చేయించాలన్నారు.

అదనపు సీట్ల కేటాయింపు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆగస్టు 22: అంబేడ్కర్ గురుకులాల్లో అదనపు సీట్లు కేటాయించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ గురుకుల పాఠశాలల్లో సీట్ల కోసం విద్యార్థుల అవస్థలపై ఆంధ్రజ్యోతిలో ఈనెల 9న సీటెలా గురూ కథనాన్ని ప్రచురించిన విషయం తెలిసిందే. ఈ కథనానికి అంబేడ్కర్ గురుకులాల రాష్ట్ర సెక్రటరీ స్పందించారు. 5 నుంచి 8వ తరగతులకు 183 అదనపు సీట్లను కేటాయించారు. సెక్షన్‌కు 5 చొప్పున 90 సీట్లు మించకుండా 183 సీట్లకు ఆమోదం తెలిపినట్లు జిల్లా కో-ఆర్డినేటర్ మురళీకృష్ణ తెలిపారు. 5వతరగతి అదనపు సీట్లను బ్రాగ్ సెట్‌లోని మెరిట్ విద్యార్థులతో భర్తీ చేయడం జరుగుతుందన్నారు. 6 నుంచి 8వ తరగతుల అదనపు సీట్లను ప్రవేశ పరీక్ష నిర్వహించి మెరిట్ ఆధారంగా భర్తీ చేయడం జరుగుతుందన్నారు.

జేఎన్‌టీయూకు ఐఎస్ఓ గుర్తింపు

వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు



ఐఎస్ఓ సర్టిఫికెట్స్‌ను అందుకుంటున్న వీసీ, రిజిస్ట్రార్

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 22: నాణ్యమైన ఇంజనీరింగ్ విద్యకు జేఎన్‌టీయూ మారుపేరని ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు అన్నారు. జేఎన్‌టీయూకి మూడవసారి ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డ్స్ (ఐఎస్ఓ) గుర్తింపు లభించింది. గురువారం జేఎన్‌టీయూని సందర్శించిన ఐఎస్ఓ ప్రతినిధులు అన్ని విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో వీసీ సుదర్శనరావు మాట్లాడుతూ.. ఉన్నతవిద్యలో నాణ్యతా ప్రమాణాలతో కూడిన వసతులు కల్పిస్తున్నామని దీంతో అంతర్జాతీయస్థాయి గుర్తింపును పొందుతున్నామన్నారు. ఇదే ఒరవడిని భవిష్యత్తులో పాటిస్తూ మరింత అభివృద్ధికి అందరూ సమష్టి కృషి చేయాలని సూచించారు. అనంతరం ఐఎస్ఓ ప్రతినిధి శివయ్య వీసీ సుదర్శనరావు, రిజిస్ట్రార్ క్రిష్ణయ్యకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో ఓఎస్‌డీ టు వీసీ దేవన్న, డైరెక్టర్లు దుర్గాప్రసాద్, సుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, ఎంబీఏ విభాగాధిపతి నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టమోటా కిలో రూ.20

అనంతపురంరూరల్, ఆగస్టు 22: కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.20తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. గురువారం 3750 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయన్నారు. అలాగే కిలో సరాసరి ధర రూ.11, కనిష్ఠ ధర రూ.6 పలికినట్లు ఆయన తెలిపారు.

నామినేటెడ్ ఎదురుచూపులు

ఊరిస్తున్న పదవులు

పదుల సంఖ్యలో ఆశావహులు... పూర్తయిన కసరత్తు

ఒక్కో నియోజకవర్గానికి నలుగురి పేర్ల పరిశీలన

తొలివిడతలో ముగ్గురికే చోటు

రెండుమూడ్రోజుల్లో అధికారిక ప్రకటన వెలువడే అవకాశం



అనంతపురం, ఆగస్టు 22 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుదీరి రెండు నెలలకుపైగా కావస్తోంది. దాదాపు నెల రోజులుగా నామినేటెడ్ పదవుల పంపకాలపై కూటమిలోని టీడీపీ, జనసేన, బీజేపీ అధినాయకత్వాలు కసరత్తు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే జిల్లాలో ఆయా పార్టీల తరఫున ఎవరికి నామినేటెడ్ పదవులివ్వాలి..? ఎవరు అర్హులు..? పార్టీకి కష్టపడిన నాయకులెవరు..? మరీ ముఖ్యంగా వైసీపీ ఐదేళ్ల పాలనలో ఆ పార్టీ అరాచకాలకు ఎదురొడ్డి పోరాడిన నాయకులెవరు..? అక్రమ కేసులతో ఇబ్బందిపడిన నేతలెవరు..? ఇలా అనేక వివరాలను పరిగణలోకి తీసుకొని నామినేటెడ్ పదవులివ్వాలన్నది ఆయా పార్టీలు అంచనాకు వచ్చాయి. కూటమిలోని బీజేపీ, జనసేన పార్టీల్లో చురుగ్గా పనిచేసే నాయకులను వేళ్లమీద లెక్కపెట్టే పరిస్థితి ఉంది. తెలుగుదేశం పార్టీలో ఆ పరిస్థితి లేదు. ఈ నేపథ్యంలోనే నియోజకవర్గం నుంచి 20 మంది పేర్లను ఆ పార్టీ అధిష్టానం పరిగణలోకి తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఆ పార్టీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేశ్‌ఆయా నియోజకవర్గాల స్థానిక ఎమ్మెల్యేలతోపాటు జిల్లా అధ్యక్షులకు బాధ్యతలు అప్పగించారు. అంతటితో ఆగని ఆ పార్టీ అధినాయకత్వం పార్టీ ప్రత్యేకంగా నియమించుకున్న నిఘా వర్గాల ద్వారానూ నామినేటెడ్ పదవులు ఎవరికి ఇవ్వాలనే జాబితాను సేకరించింది. కాగా ఇప్పటికే ఆ పార్టీ అధిష్టానానికి అటు ఎమ్మెల్యేలు, ఇటు పార్టీ పార్లమెంటు అధ్యక్షులు, మరోవైపు నిఘా వర్గాల ద్వారా సేకరించిన జాబితాను వడపోసినట్లు సమాచారం. వడపోతలో భాగంగా ఒక్కో నియోజకవర్గం నుంచి నలుగురి పేర్లు పరిశీలనలోకి తీసుకున్నట్లు టీడీపీ అధిష్టానం ముఖ్య వర్గాల ద్వారా అందిన సమాచారం. ఆ నలుగురి పేర్లలోనూ ఎవరు పార్టీకి విధేయులుగా పనిచేశారు..? ఎవరు వైసీపీ పాలనలో ఇబ్బందులకు గురయ్యారు..? కేసులతో నలిగిపోయారు..? ఆ వివరాలను పూర్తిస్థాయిలో సేకరించి ఆ నలుగురిలోనూ ఒకరిద్దరికి మాత్రమే ఏదో రూపంలో నామినేటెడ్ పదవులతో సంతృప్తిపరచాలనే యోచనలో టీడీపీ అధిష్టానం ఉన్నట్లు తెలుస్తోంది.

ఇదిలా ఉండగా... నామినేటెడ్ పదవులు ఆశిస్తున్నవారు టీడీపీలో అత్యధికులున్నారు. అందులోనూ పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేస్తున్న వారూ లేకపోలేదు. తనకు నామినేటెడ్ పదవి దక్కుతుందనే ఆశల్లో ఎవరికి వారున్నారు. అదిగో... ఇదిగో నామినేటెడ్ పదవుల ప్రకటన వెలువడుతుందని నామినేటెడ్ పదవులను ఆశిస్తున్న ఆశావాహులు ఎదురుచూస్తున్నారనడంలో ఎలాంటి సందేహం లేదు. ఆషాడమాసం పూర్తయిన వెంటనే నామినేటెడ్ పదవుల జాబితా విడుదల చేస్తారని ఆశావాహులు ఆశించారు. శ్రావణమాసంలో పక్షంరోజులు గడుస్తున్నా ఇప్పటికీ నామినేటెడ్ పదవుల ఆశావాహులకు ఎదురుచూపులే మిగిలాయి. కాగా సోషల్‌మీడియాలో నామినేటెడ్ రాష్ట్రస్థాయి పదవుల జాబితా చక్కర్లు కొడుతున్న నేపథ్యంలో జిల్లాలో ఎవరైతే నామినేటెడ్ పదవులు ఆశిస్తున్నారో ఆ ఆశావాహుల పేర్లు ఆ జాబితాలో లేకపోవడంతో ఒకింత అసంతృప్తిని వ్యక్తం చేస్తున్న పరిస్థితులు ఆ పార్టీలో లేకపోలేదు. కొందరైతే ఫేక్ అంటూ కొట్టిపారేస్తూనే లోలోన మాత్రం మదనపడుతున్నారనడంలో ఎలాంటి సందేహం లేదు. ఏదేమైనప్పటికీ జిల్లాకు మాత్రం రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవులు తప్పకుండా లభిస్తాయనే ఆశాభావంలో ఆశావాహులుండటం గమనార్హం.

తొలివిడతలో ముగ్గురికే చోటు...

కూటమి ప్రభుత్వం మరో రెండుమూడ్రోజుల్లో నామినేటెడ్ పదవుల పందేరానికి రంగం సిద్ధం చేసినట్లు ఆయా పార్టీల ముఖ్యనేతల ద్వారా అందిన సమాచారం. మొదటి విడతలో రాష్ట్రస్థాయి అందులోనూ కేబినేట్ హోదా పదవుల జాబితాను విడుదల చేయనున్నట్లు తెలుస్తోంది. తొలివిడత నామినేటెడ్ పదవుల్లో జిల్లాలో ముగ్గురికి చోటు కల్పించే అవకాశాలు మెండుగా ఉన్నాయని సమాచారం. టీడీపీ అధిష్టానం ముఖ్య వర్గాల ద్వారా అందిన సమాచారం మేరకు ఓసీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన ముగ్గురు నేతలకు నామినేటెడ్ పదవులు దక్కనున్నట్లు తెలుస్తోంది. అయితే ఆ నామినేటెడ్ పదవులు ఎవరికి దక్కనున్నాయో ఇప్పటివరకూ పేర్లు బయటకు పొక్కకుండా గోప్యంగా ఆ పార్టీ అధిష్టానం వ్యవహరిస్తోంది. జనసేన, బీజేపీల నుంచి ఎవరికి నామినేటెడ్ పదవులు దక్కనున్నాయో బయటకు పొక్కకపోవడం గమనార్హం.

దరఖాస్తు చేసుకోండి

అనంతపురం విద్య, ఆగస్టు 22: నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) పరీక్షలు డిసెంబరు 8న జరుగుతాయని, వచ్చే నెల 9వ తేదీలోగా పరీక్షలకు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ వరలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు చేయడానికి ప్రభుత్వ పరీక్షల కార్యాలయ వెబ్‌సైట్ ఈనెల 5వ తేదీ నుంచి అందుబాటులో ఉందన్నారు. విద్యార్థులు తమ ఆధార్‌కార్డులో ఉన్న విధంగానే పేరు, పుట్టిన తేదీ, తండ్రి పేరు నమోదు చేయాలన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ, జడ్పీ, మున్సిపల్, ఎయిడెడ్, ఎంపీపీ పాఠశాలల, వసతి లేని ఏపీ మోడల్ స్కూళ్లలో 8వ తరగతి చదువుతూ రూ.3.50 లక్షల లోపు వార్షిక ఆదాయం ఉన్న విద్యార్థులు దరఖాస్తు చేసుకునేందుకు అర్హులన్నారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ. 100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ. 50 పరీక్ష ఫీజుగా ఎస్‌బీఐ కలెక్షన్ లింకు ద్వారా మాత్రమే చెల్లించాలని సూచించారు. మరిన్ని వివరాలకు కమలానగర్‌లో ఉన్న డీఈఓ ఆఫీస్‌లోని పరీక్షల విభాగంలో సంప్రదించాలని సూచించారు.

వ్యవసాయ అధికారి ఇంట్లో చోరీ

37 తులాల బంగారు నగలు, రూ. 50 వేల నగదు అపహరణ



చోరీ వివరాలు తెలుసుకుంటున్న సీఐ సురేష్

పుట్టపర్తి రూరల్, ఆగస్టు 22: జిల్లా కేంద్రానికి కూతవేటుదూరంలో ఉన్న సందీప్‌విల్లాస్‌లోని ఓ విల్లాలో నివాసముంటున్న మండల వ్యవసాయ అధికారి వెంకటబ్రహ్మం ఇంటిలో చోరీ జరిగింది. బుధవారం అర్ధరాత్రి వ్యవసాయ అధికారి చెందిన విల్లానెంబరు 40లో ఇంటి కిటికీలు తొలగించి లోనికి ప్రవేశించిన దొంగలు బీరువాలో ఉన్న 37 తులాల బంగారంతోపాటు రూ. 50 వేల నగదును దొంగలించారు. విధుల్లో భాగంగా వ్యవసాయ అధికారి బయటకు వెళ్లి అర్ధరాత్రి తర్వాత ఇంటికి వచ్చారు. ఇంటిని పరిశీలించగానే చోరీ జరిగినట్లు గుర్తించారు. కాగా ఆతడి భార్య పై అంతస్థులో నిద్రిస్తోంది. వ్యవసాయ అధికారి ఫిర్యాదు మేరకు పుట్టపర్తి రూరల్ సీఐ సురేష్, ఎస్ఐ క్రిష్ణమూర్తి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



వన్నూరుస్వామి (ఫైల్)

కళ్యాణదుర్గం(కంబదూరు), ఆగస్టు 22: కంబదూరు మండల పరిధిలోని అండేపల్లికి చెందిన రైతు వన్నూరు స్వామి(48) విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. వన్నూరు స్వామి తనకున్న రెండు ఎకరాల్లో టమోటా పంటను సాగు చేశాడు. బుధవారం ఉదయమే పంటకు మందును పిచికారి చేసేందుకు వెళ్లాడు. పంటకు మందును పిచికారి చేసిన తర్వాత వ్యవసాయ మోటర్ ఆఫ్ కావడంతో తోట పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ వద్దకు వెళ్లాడు. అక్కడ కింద పడి ఉన్న విద్యుత్ తీగను సరిచేసేందుకు వెళ్లి ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో భార్య చిట్టెమ్మకు అనుమానం వచ్చి తోటలోకి బంధువులతో కలిసి వెళ్లింది. భర్త విగతజీవిగా పడి ఉండడం చూసి భార్య, బంధువులు బోరున విలపించారు. గురువారం కంబదూరు పోలీసులకు భార్య చిట్టెమ్మ ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీ ఎప్పుడో..?

వారం రోజుల క్రితం సబ్సిడీ ఖరారు

పూర్తి ధరలు ఖరారు చేయని ఉన్నతాధికారులు

ప్రత్యామ్నాయ విత్తనాల కేటాయింపుతో సరిపెట్టిన వైనం

విత్తనాల సరఫరా కోసం ఆన్‌లైన్ టెండర్ల నిర్వహణ

వర్షాలతో ప్రత్యామ్నాయ పంటల సాగుకు రైతులు సన్నద్ధం



అనంతపురం అర్బన్ ఆగస్టు 22: జిల్లావ్యాప్తంగా కొన్ని రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. ఈ ఏడాది ఖరీఫ్‌లో వర్షాభావంతో వేరుశనగ, ఇతర రకాల పంటలు సాగు చేయలేని రైతులు ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు సిద్ధమయ్యారు. అయితే జిల్లా రైతులకు ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు ఎప్పటి నుంచి పంపిణీ చేస్తారో తెలియని పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో ఆశించిన స్థాయిలో పంటలు సాగు కాలేదు. ఈ నేపథ్యంలో జిల్లాకు ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు అవసరమని జిల్లా వ్యవసాయ యంత్రాంగం రాష్ట్ర కమిషనరేట్‌కు ఇదివరకే ప్రతిపాదనలు పంపింది. ఎట్టకేలకు గత వారం రోజుల క్రితం జిల్లాకు ప్రత్యామ్నాయ విత్తనాలు కేటాయించడంతోపాటు ప్రత్యామ్నాయ విత్తనాల సబ్సిడీ ధర ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే ఇప్పటి దాకా విత్తనాల పూర్తి ధరలు ఖరారు చేయలేదు. ప్రత్యామ్నాయ విత్తనాలు సరఫరా కోసం ఏపీసీడ్స్ రాష్ట్ర ఉన్నతాధికారులు బుధవారం ఆన్‌లైన్ టెండర్లు నిర్వహించడంతోపాటు ఆన్‌లైన్ టెండర్లల్లో ఓపెన్ చేసి, ఎవరెవరు ఏయే ధరలకు టెండర్ దాఖలు చేశారన్న వివరాలు నమోదు చేసినట్లు సమాచారం. శుక్రవారం ఆన్‌లైన్‌లో టెండర్లు దాఖలు చేసిన టెండర్‌దారులతో ఫైనల్ ధరల ఖరారుపై చర్చించేందుకు విజయవాడకు రావాలని పిలిచినట్లు సమాచారం. టెండర్లు ఖరారైన తర్వాత ఎప్పటిలోగా జిల్లాకు ప్రత్యామ్నాయ విత్తనాలు సరఫరా చేస్తారు..? ఏయే తేదీల్లో విత్తన పంపిణీ ఉంటుందన్న వివరాలు తెలిసే అవకాశం ఉంది. కొన్ని రోజులుగా జిల్లాలో భారీ వర్షాలు పడుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. పొలాల్లో పదును ఆరగానే విత్తనం వేసేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తనాల కోసం సన్న,చిన్నకారు రైతులు నిరీక్షిస్తున్నారు. మరికొందరు సబ్సిడీ విత్తనాలు ఇవ్వడం ఆలస్యమైతే ఇబ్బందులు ఎదురవుతాయన్న ఆలోచనతో బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో వర్షాభావంతో ప్రధాన పంటల సాగు తగ్గుముఖం పట్టిన నేపథ్యంలో ప్రత్యామ్నాయ పంటల విత్తనాల కోసం ప్రతిపాదనలు పంపిన సమయంలోనే టెండర్ల నిర్వహణపై దృష్టి సారించి ఉంటే ఈ పాటికి రైతుల చేతుల్లో విత్తనాలు ఉండేవన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

బీడుగా 2.03 లక్షల హెక్టార్లు

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్ సాధారణ సాగు విస్తీర్ణం 3.46 లక్షల హెక్టార్లు. ఇందులో వేరుశనగ 1.97 లక్షల హెక్టార్లుగా అంచనా వేశారు. ఇప్పటి దాకా 1.43 లక్షల హెక్టార్లల్లోనే వివిధ రకాల పంటలు సాగయ్యాయి. ఇందులో వేరుశనగ 53వేల హెక్టార్లు, కంది 40వేలు, పత్తి 21వేలు, ఆముదం 12వేలు, మొక్కజొన్న 7580, సజ్జ 2149, కొర్ర 2645 హెక్టార్లల్లో సాగయ్యాయి. మిగతా విస్తీర్ణంలో జొన్న, పొద్దుతిరుగుడు, సోయాబీన్, పెసలు, మినుములు తదితర పంటలు సాగయ్యాయి. కాగా జిల్లావ్యాప్తంగా ఇంకా 2.03 లక్షల హెక్టార్లల్లో పొలాలు బీడుగా మిగిలిపోయాయి.

ప్రత్యామ్నాయ విత్తనాల కేటాయింపుతో సరి..

ఈ ఏడాది వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వేరుశనగ, కంది, ఇతర రకాల పంటలు ఆశించిన స్థాయిలో సాగు కాలేదు. ఇదివరకే వేరుశనగ, ఇతర ప్రధాన పంటల సాగుకు అదును సమయం దాటిపోయింది. ఈ నేపథ్యంలో జిల్లాకు 27907 క్వింటాళ్ల ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు కేటాయించారు. ఇందులో ఉలవలు 21791 క్వింటాళ్లు, పెసలు 1501, అలసంద 3253, జొన్న 973, కొర్ర 369, మినుములు 20 క్వింటాళ్లను కేటాయించారు. వారం రోజుల క్రితం ప్రత్యామ్నాయ పంటలవిత్తనాలు కేటాయించడంతోపాటు 80 శాతం సబ్సిడీ ఖరారు చేయడంతో సరిపెట్టారు.

అలసంద సాగు చేస్తా



ఖరీఫ్‌లో వర్షాలు సరిగా పడకపోవడంతో వేరుశనగ పంట సాగు చేయలేకపోయా. కొన్ని రోజులుగా పదును వాన పడుతోంది. పదును ఆరిన తర్వాత ఐదెకరాల్లో అలసంద పంట సాగు చేస్తా. అంతలోగా వ్యవసాయ శాఖ అధికారులు సబ్సిడీతో ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీ చేస్తే ఉపయోగంగా ఉంటుంది. పంపిణీ ఆలస్యమైతే బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేసి పంట సాగు చేయాలనుకుంటున్నా.

- బండి భరత్, కొర్రకోడు, కూడేరు

మార్కెట్‌లో జొన్న విత్తనాలు కొనుగోలు చేశా

ఎనిమిదెకరాల పొలంలో జొన్న సాగు చేసేందుకు సిద్ధం చేసుకున్నా. ఎకరాకు 3 కేజీల జొన్న విత్తనాలు అవసరం. కొన్నిరోజులుగా వానలు బాగా పడుతున్నాయి. సబ్సిడీ విత్తనం ఎప్పుడు ఇస్తారో ఏమో తెలియడం లేదు. అందుకే కేజీ రూ.80లతో బయట మార్కెట్‌లో జొన్న విత్తనాలు కొనుగోలు చేశా. పదును ఆరగానే జొన్న విత్తేస్తా.



- సూర్యనారాయణ, పిన్నేపల్లి, యాడికి మండలం

ఆన్‌లైన్ టెండర్లు నిర్వహించారు

ఏపీసీడ్స్ రాష్ట్ర ఉన్నతాధికారులు బుధవారం ప్రత్యామ్నాయ విత్తనాల సరఫరా కోసం ఆన్‌లైన్ టెండర్లు నిర్వహించడంతోపాటు టెండర్లు ఓపెన్ చేశారు. టెండర్లు ఖరారు చేసేందుకు ఆన్‌లైన్‌లో టెండర్ దాఖలు చేసిన టెండర్‌దారులను శుక్రవారం విజయవాడకు రావాలని ఉన్నతాధికారులు తెలియజేశారు. టెండర్లు ఖరారుకాగానే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విత్తన సరఫరాదారుల నుంచి జిల్లాకు ప్రత్యామ్నాయ విత్తనాలు తెప్పించి, వ్యవసాయ శాఖ అధికారుల సమన్వయంతో రైతులకు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటాం.

- సుబ్బయ్య, ఏపీ సీడ్స్ జిల్లా మేనేజర్

సోలార్‌తో వినియోగదారుడికి ఆదాయం

విద్యుత్‌శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్




సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ

హిందూపురం అర్బన్, ఆగస్టు 22: సోలార్ ప్యానల్ వాడకంతో వినియోగదారుడికి ఆదాయం సమకూరుతుందని విద్యుత్‌శాఖ ఎస్ఈ సంపత్‌కుమార్ అన్నారు. సోలార్ ప్యానల్ వేసుకున్న వారు అవసరం మేకు విద్యుత్ వినియోగించుకొని మిగిలిన దానిని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందన్నారు. స్థానిక వాసవీ ధర్మశాలలో గురువారం డివిజన్‌స్థాయి సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కేవలం రూ. 63 కోట్లు బిల్లులు వసూలు అయ్యేదని ఇప్పుడు అది రూ. 135 కోట్లకు పెరిగిందన్నారు. నాణ్యమైన విద్యుత్ అందించే దిశలో అధికారులు, సిబ్బంది నిరంతర సేవలు అందించాలన్నారు. ముఖ్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి సూర్యఘర్ యోజన ద్వారా సోలార్ ప్యానల్‌లను ఏర్పాటు చేసి ఖర్చులను తగ్గించుకునే ప్రణాళిక తీసుకొచ్చారన్నారు. దీని ద్వారా వినియోగదారుడికి విద్యుత్ ఖర్చు తగ్గుతుందన్నారు. హిందూపురం డివిజన్‌లో లక్ష సోలార్ ప్యానల్‌లు అతిత్వరలో ఏర్పాటు చేసే దిశగా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. కార్యక్రమంలో ఈఈ భూపతి, ఎస్ఏఓ బాలాజీ వెంకటేష్, సన్‌మిత్ర అధినేత ఓబుళేష్, 1104 యూనియన్ డివిజన్ కార్యదర్శి డిఎల్ శ్రీనివాసులు, ఇతర జేఏసీ నాయకులు, ఏడిఈలు, ఏఈఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

చోరీకి వెళితే ప్రాణాలు పోయాయి..!

పై అంతస్తు నుంచి దూకిన దొంగ

అక్కడికక్కడే మృతి



అనంతపురం క్రైం, ఆగస్టు 22: దొంగతనానికి వెళ్లిన ఓ దొంగ చావు కొనితెచ్చుకున్నాడు. ఓ అపార్ట్‌మెంట్‌లో దొంగతనానికి వెళ్లి అక్కడి వారు గుర్తించడంతో పై అంతస్తు కెళ్లి భయంతో దూకేశాడు. దీంతో తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే మృతి చెందాడు. బుక్కరాయసముద్రం మండలం చెదళ్లకు చెందిన కురుబ యల్లప్ప (28) అవివాహితుడు. గుజిరీ సామాన్లు దొంగతనం చేసేవాడు. గురువారం తెల్లవారుజామున రిలయన్స్ మార్ట్ సమీపంలోని ఓ అపార్ట్‌మెంట్‌లోకి దొంగతనానికి వెళ్లాడు. అందులోని ఓ ఫ్లాట్‌లో దొంగతనానికి ప్రయత్నిస్తుండగా కిందఫ్లోర్‌లో ఉండే కియా సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు ఇద్దరు అప్రమత్తమయ్యారు. ఏదో శబ్దం వస్తోందని వారు పైకి వెళ్లి చూశారు. వారిని గమనించిన దొంగ పైఅంతస్తుకెళ్లాడు. వారు అలాగే వెంబడించడంతో దిక్కుతోచని దొంగ భయంతో పైఅంతస్తు నుంచి కిందకు దూకేశాడు. కాళ్లు, తొడ భాగంలో తీవ్ర రక్తగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. త్రీటౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్య



సునీత మృతదేహం

గుత్తిరూరల్, ఆగస్టు 22: మండలంలోని తురకపల్లి గ్రామంలో గురువారం వివాహిత సునీత (34) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. గ్రామానికి చెందిన వెంకటేశ్వరరెడ్డి భార్య సునీత గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేది. ఈ నేపథ్యంలో ఇంట్లో ఎవరూలేని సమయంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో పడివుంది. బంధువులు గుర్తించి గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

చీనీ కాయలు టన్ను రూ.23 వేలు

అనంతపురం రూరల్, ఆగస్టు 22: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.23వేలు, కనిష్ఠంగా రూ.10వేలు, సరాసరి రూ.16వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి జయలక్ష్మి తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 162 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.



బంగారం కొనబడును

మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్, ఫైనాన్స్‌లో తాకట్టులో వున్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును. స్పాట్ క్యాష్, షిఫ్టింగ్ చేయబడును.(రిటైర్డు పోలీస్ డిపార్టుమెంట్) గోల్డెన్ ట్రేడింగ్ కంపెనీ. సంప్ర॥ 7382114647

AJA- 198059

PCMR E.M.SCHOOL

Wanted Teachers for higher Sections Social, Hindi,PET,Hand writing and Art & Craft, Cont:PCMR E.M.School,Nagaluru, DMM. Cell:9885386684, 9505292219.

AJA-198032

@3750 తో ఆఫీస్ ఆటోమేషన్

అన్ని GOVT ఉద్యోగాలకు AP-SBTET ద్వారా పొసైనా సర్టిఫికేట్ ఉపయోగబడును Q:10th Pass Last Date:20/08/24 సాయి ఇన్‌స్టిట్యూషన్, కమలానగర్ ATP, Cell:9059723829

AJA-198060

WANTED

Freshco Goli Soda కు అనంతపురం జిల్లా అంతటా డిస్ట్రిబ్యూటర్లు, సూపర్ స్టాకిస్టులు, డీలర్లు, ఫ్రాంచెజీలు కావలెను. సంప్రదించండి Ph:9642965474

AJA-198061

సెక్యూరిటీ గార్డ్స్ కావలెను

ATP టౌన్ నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. అర్హత:10th/Inter వయస్సు:35-45 సంఖలు స్థానికులకు, అనుభవం కలవారికి ప్రాధాన్యత, క్లీనింగ్‌కు మహిళలు కావలెను Cont:8179290778.

AJA-198036

WANTED

అనంతపురం పట్టణంలోని ప్రముఖ ఆఫీస్ నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. Age:40 Years Below, వుండవలెను. Contact:9381838140

AJA-198058

ప్లాట్ అమ్మబడును

గుంతకల్లులో ఆలూరు రోడ్డు, ప్రశాంతి నగర్, 4వ వార్డులో పడమర, దక్షిణం కార్నర్ స్థలం అమ్మకం కలదు. సైజు 60x40, 266.66 గజాలు, 20 అడుగుల రోడ్డు కలవు. Contact:9848078343.

AJA-189131

PLOT FOR SALE

★ CRDA approved Chodavaram, Vijayawada gated layout Plots, 15 minutes from Benz Circle beautiful location between Krishna River & KEB Canal. M-9948099840, 9866602266 AJH-98269

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

29న 5కే రెడ్ రన్ మారథాన్

● డీఎంహెచ్ఓ ఈబీ దేవి



అధికారులతో చర్చిస్తున్న డీఎంహెచ్ఓ

అనంతపురంటౌన్, ఆగస్టు 28: ఇంటర్నేషనల్ యూత్‌డే సందర్భంగా 29వ తేదీన 5కే రెడ్‌రన్‌మారథాన్ నిర్వహిస్తున్నట్లు డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి పేర్కొన్నారు. గురువారం జిల్లా కార్యాలయంలో మారథాన్‌పై ప్రోగ్రామ్ అధికారులతో ఆమె సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన పెంచడం కోసం ఎయిడ్స్ నియంత్రణ విభాగం, వైద్యశాఖ సంయుక్తంగా మారథాన్ నిర్వహిస్తున్నాయన్నారు. జిల్లా కేంద్రంలో ఉదయం 6-30గంటలకు స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల వద్ద ప్రారంభమై టవర్‌క్లాక్, సప్తగిరి సర్కిల్, సర్వజన ఆస్పత్రి, కోర్టు రోడ్డుమీదుగా తిరిగి ఆర్ట్స్ కాలేజ్ వరకు రన్ కొనసాగుతుందన్నారు. జూనియర్, డిగ్రీ కళాశాలలు, పాఠశాలలు, ఎన్‌సీసీ విభాగాల అధికారులు సహకరించాలని ఆమె కోరారు. సమావేశంలో ఎయిడ్స్ నియంత్రణాధికారి అనుపమజేమ్స్, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సుజాత, సూపర్‌వైజర్ జీవీ రమణ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చొరవతో రోడ్డుకు మరమ్మతులు



రోడ్డుకు మట్టి వేసిన దృశ్యం

రాప్తాడు, ఆగస్టు 22: ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల మండలంలోని బోగినేపల్లి-పాలచెర్ల మధ్యనున్న కల్వర్టు వద్ద మట్టి కొట్టుకుపోవడంతో సమస్యను ఎమ్మెల్యే పరిటాల సునీత వెంటనే పరిష్కరించారు. వైసీపీ ప్రభుత్వంలో తారురోడ్డు నిర్మాణంలో భాగంగా బోగినేపల్లి-పాలచెర్ల గ్రామాల మధ్య కల్వర్టు నిర్మించారు. కల్వర్టు కింద నీరు సక్రమంగా వెళ్లక మట్టిరోడ్డు కొట్టుకుపోయింది. ఆ దారి గుండా వెళ్లే బస్సులు, ఇతర వాహనాలు మూడు రోజులుగా వేరే దారిలో వెలుతున్నాయి. సమస్య పరిష్కరించాలని బోగినేపల్లి సర్పంచ్ ఉజ్జినప్ప, గ్రామస్థులు ఎమ్మెల్యేను కోరారు. ఆమె వెంటనే ఆర్‌అండ్‌బీ అధికారులకు ఫోన్ చేసి రోడ్డుకు మరమ్మతులు చేయాలని ఆదేశించడంతో అధికారులు రోడ్డుకు మరమ్మతులు చేయించారు.

వైద్యుల ప్రాణరక్షణకు చట్టం తీసుకురావాలి



మాట్లాడుతున్న సాకే హరి

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 22: ప్రజలకు ప్రాణాలుపోసే వైద్యులపైనే కిరాతకమైన దాడులు జరుగుతున్నాయని వారి ప్రాణరక్షణకు ప్రత్యేక చట్టాన్ని తీసుకురావాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకేహరి డిమాండ్ చేశారు. గురువారం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో నిర్వహించిన ధర్నాకు ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ మద్దతు తెలిపింది. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో బిక్కుబిక్కుమంటూ వైద్యులు విధులు నిర్వహిస్తున్నారన్నారు. నర్సులు, డాక్టర్లు, టెక్నీషియన్లు ఇలా ప్రతి ఉద్యోగికి రక్షణ కల్పించే బాధ్యత ప్రభుత్వాలపై ఉందన్నారు. నాయకులు రామకృష్ణ, నరసింహులు, లక్ష్మీనారాయణ, రమేష్, ఓబులేష్ పాల్గొన్నారు.

కోల్‌కతా ఘటనకు నిరసనగా ర్యాలీ



నరగంలో ర్యాలీ చేస్తున్న బాలాజీ ఫార్మసీ కళాశాల విద్యార్థులు

అనంతపురంరూరల్, ఆగస్టు 22: కోల్‌కతాలో వైద్యురాలిపై హత్యాచారాన్ని నిరసిస్తూ స్థానిక రుద్రంపేటలోని బాలాజీ ఫార్మసీ కళాశాల ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ చేపట్టారు. గురువారం నగరంలోని సప్తగిరి సర్కిల్ కూడలి నుంచి క్లాక్‌టవర్ వరకు ప్లకార్డులు చేతపట్టుకుని ర్యాలీ నిర్వహించారు. డాక్టర్‌పై అత్యాచారానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ అన్నారు. కార్యక్రమంలో కళాశాల మహిళా సాధికారత విభాగాధిపతి రాధిక, విద్యార్థులు పాల్గొన్నారు.

గొర్రెల కాపరి హంతకులను శిక్షించాలి



మాట్లాడుతున్న లింగమయ్య

అనంతపురం విద్య, ఆగస్టు 22: హిందూపురం మండలం మణుగూరు గ్రామ పొలిమేరలో గొర్రెల కాపరి జయమ్మ (56)ను హత్యచేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని ఏపీ చేతివృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు లింగమయ్య డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ కార్యాలయంలో యూనియన్ నాయకులు సమావేశం నిర్వహించారు. ఆయన మాటాడుతూ చేతివృత్తి చేసుకుంటున్న కాపరి జమమ్మను దొంగలు దారుణంగా హత్యచేశారన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి రూ.15 లక్షలు నష్టపరిహారం చెల్లించాలన్నారు. దొంగలు అపహరించిన 14 మేకలను రికవరీ చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. నాయకులు హరికృష్ణ, నాగప్ప, గోవిందరాజులు పాల్గొన్నారు.

ఘనంగా చిరంజీవి జన్మదిన వేడుకలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఆగస్టు22: మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను జనసేన పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీసీ వరుణ్ ఆదేశాల మేరకు 1వ డివిజన్ ఇన్‌చార్జ్ ప్రసాద్‌రాయల్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. నగర అధ్యక్షుడు పొదిలి బాబురావు ముఖ్య అతిథులుగా హాజరై కేక్ కట్ చేసి ఆనందం పంచుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పలువురు యువత పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం వారికి ప్రశంసాపత్రాలను అందజేశారు. నాయకులు వరుణ్, చక్రి, రఘు, కల్పన, సిద్దు, మేదర వెంకటేష్, లాల్‌స్వామి, వల్లంశెట్టి రమణ, కుమ్మర మురళీకృష్ణ, విజయ్ రాయల్, హిద్దు, వంశీ, ముత్యాలరెడ్డి, లక్ష్మన్న, ఉదయ్ కుమార్, నూర్‌బాషా పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న జనసేన నాయకులు

వైభవంగా రాఘవేంద్రుడి ఉత్తరారాధన

అనంతపురం కల్చరల్, ఆగస్టు 22: రాఘవేంద్రస్వామి 353వ ఆరాధనోత్సవాల్లో భాగంగా గురువారం మొదటిరోడ్డులోని మంత్రాలయ రాఘవేంద్రస్వామి మఠంలో ఉత్తరారాధన వేడుకలను వైభవోపేతంగా నిర్వహించారు. ఉదయం స్వామివారి బృందావనానికి నిర్మాల్య విసర్జన గావించడం తోపాటు అష్టోత్తర పారాయణ సహిత క్షీరాభిషేకం, పంచామృతాభిషేకాలు, పాదపూజ, కనకాభిషేకం నిర్వహించారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన రథంలో స్వామివారి ఉత్సవ మూర్తిని ఆశీనులు గావించి పుర వీధులగుండా ఊరేగించారు. రథోత్సవం ముందు భక్తులు కోలాటాలు ఆడుతూ, నృత్యాలు చేస్తూ, భక్తిగీతాలు ఆలపిస్తూ భజనలు చేస్తూ ముందుకు సాగారు. మఠం మేనేజర్ భద్రినాథ్, ఓం సంగీత నృత్య కోలాట శిక్షణ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షురాలు దేవరకొండ కౌసల్య బృందం పాల్గొన్నారు.



నగరంలో రాఘవేంద్రస్వామి రోథానికి పూజలు చేస్తున్న అర్చకులు



స్వామివారి సన్నిధిలో కోలాట, నృత్య సభ్యులు

ముగిసిన ఆరాధనోత్సవాలు

అనంతపురం విద్య: శ్రీ గురురాయ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జగద్గురు మంత్రాలయ రాఘవేంద్ర స్వామి మహోత్సవాలు ఘనంగా ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం రవీంద్రస్వామిజీ గృహంలో తృతీయ ఆరాధన నిర్వహించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ రాఘవేంద్ర స్వామి, వెంకటేశ్వరస్వామి, పంచముఖ ఆంజనేయస్వామి మూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం, రాత్రి కరుట్లపల్లి, కూడేరు, ఆత్మకూరు, బెంగళూరు, చోళసముద్రం, కడదరకుంట తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ట్రస్టు సభ్యులు అన్నవితరణ చేశారు.



భక్తులకు పండ్లు అందజేస్తున్న స్వామీజీ

భక్తిశ్రద్ధలతో సంకష్ట చతుర్థి

అనంతపురం కల్చరల్, ఆగస్టు 22: శ్రావణ శుద్ధ చవితిని పురస్కరించుకుని గురువారం సాయంత్రం నగరంలోని పలు ఆలయాల్లో సంకష్ట చతుర్థి పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. రామచంద్రనగర్ షిర్డీసాయి బాబా ఆలయంలో గణనాథుని మూలవిరాట్‌కు ఫల పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి ప్రీతిపాత్రమైన గరిక, కుడుములను నివేదించి పూజాది కైంకర్యాలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు మారుతి, భక్తులు పాల్గొన్నారు.



పూజలందుకుంటున్న గణనాథుడు

జేఎన్‌టీయూ వైస్ ప్రిన్సిపాల్ బాధ్యతల స్వీకరణ



వీసీ సుదర్శనరావుకు శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రొఫెసర్ వసుంధర

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 22: జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా ప్రొఫెసర్ వసుంధర గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఆమెను వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ క్రిష్ణయ్య అభినందించారు. ఇక్కడ పనిచేస్తున్న ప్రొఫెసర్ అరుణకాంతి బదిలీ కావడంతో కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్ విభాగ ప్రొఫెసర్ అయిన వసుంధరను నియమించారు. విభాగాధిపతులు అజిత, కళ్యాణిరాధతో పాటు పలువురు డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఆవిష్కరణలకు కేంద్ర ప్రభుత్వ సాయం

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 22: నూతన ఆవిష్కరణలు చేపట్టేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థులకు సహాయ సహకారాలు అందిస్తున్నాయని ఎస్కేయూ అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ మేనేజర్ చంద్రమౌళి పేర్కొన్నారు. గురువారం ఎస్వీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన చంద్రమౌళి మాట్లాడుతూ విద్యార్థులు కొత్త ఆలోచనలతో ముందుకెళ్లినప్పుడే ఉన్నత భవిష్యత్తును అందిపుచ్చుకుంటారని సూచించారు. కళాశాల వైస్ చైర్మన్ చక్రధర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రసాద్ పాల్గొన్నారు.

25న తైక్వాండో ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 22: తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో 25వ తేదీన జిల్లాస్థాయి తైక్వాండో ఎంపిక పోటీలు రామ్‌నగర్‌లోని డీఎస్ అకాడమీలో నిర్వహించనున్నట్లు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గురుస్వామి, కార్యనిర్వాహక అధ్యక్షుడు శాంతరాజ్ తెలిపారు. సీనియర్ మహిళలు, పురుషుల క్యాటగిరీలలో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు 31వతేదీ నుంచి తిరుపతిలో నిర్వహించే 40వ రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీలకు ప్రాతినిథ్యం వహిస్తారని తెలిపారు. ఆసక్తి, అర్హతగల క్రీడాకారులు క్రీడా సామగ్రి, యూనిఫాంతో పాటు జనన ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డులతో హాజరుకావాలన్నారు. మరిన్ని వివరాలకు 9110556525 నంబరును సంప్రదించాలని కోరారు.

ప్రజాస్వామ్యబద్ధంగా ప్రతిఘటిస్తాం: వైసీపీ

అనంతపురం క్రైం, ఆగస్టు 22: ఆస్తులను ధ్వంసం చేస్తే ప్రజాస్వామ్యబద్ధంగా ప్రతిఘటిస్తామని వైసీపీ నాయకులు అన్నారు. ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు అనంత వెంకటరామిరెడ్డి, శంకరనారాయణ, కేతిరెడ్డి పెద్దారెడ్డి, మాజీ ఎంపీ తలారిరంగయ్య తదితరులు ఎస్పీ జగదీష్‌ను గురువారం కలిశారు. తాడిపత్రిలో జరిగిన ఘటనలను వివరించారు. మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డిని తాడిపత్రిలోకి రానివ్వకుండా అడ్డుకుంటున్నారని ఎస్పీ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. త్వరలోనే పెద్దారెడ్డి తాడిపత్రిలో ఉండేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే జిల్లాలోని వైసీపీ శ్రేణులతో కలిసి పెద్దారెడ్డిని తాడిపత్రికి తీసుకెళతామని అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అనేక నియోజకవర్గాల్లో ఇలాంటి పరిస్థితులే ఉన్నాయని, పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు. తాడిపత్రిలో వైసీపీ కార్యకర్తలకు రక్షణ లేకుండా పోయిందని అన్నారు.



ఎస్పీని కలిసి వస్తున్న వైసీపీ నాయకులు

ఆధునికీకరణ పనులకు భూమిపూజ

అనంతపురం కల్చరల్, ఆగస్టు 22: శారదానగర్ శివబాలయోగి ఆశ్రమ కల్యాణమండపం ఆధునికీకరణకు సంబంధించి గురువారం భూమిపూజ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమానికి శివబాలయోగి మహరాజ్ సెంట్రల్ ట్రస్టు చైర్మన్, శిష్యపరంపర శివరుద్ర బాలయోగి స్వామి ముఖ్య అతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేయడంతోపాటు వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ భూమిపూజను చేశారు. అనంతరం భక్తులు శివరుద్ర బాలయోగి స్వామికి పాదపూజలు చేశారు. ట్రస్టు బెంగుళూరు అధ్యక్షుడు రాంబాబు, ఆశ్రమ కమిటీ అధ్యక్షుడు జూటూరు అరవింద్, ఉపాధ్యక్షుడు రత్నగిరి దేవరాజ్, కార్యవర్గ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న శివరుద్ర స్వామి

బ్రోచర్ల ఆవిష్కరణ: సాయి ట్రస్టు ఆధ్వర్యంలో సెప్టెంబరు 14వ తేదీన నిర్వహించనున్న వేంకటేశ్వర వైభవం కార్యక్రమ బ్రోచర్లను శివబాలయోగి మహరాజ్ సెంట్రల్ ట్రస్టు చైర్మన్ శివరుద్ర బాలయోగి స్వామి ఆవిష్కరించారు. గురువారం ఆశ్రమ కల్యాణమండపం భూమిపూజకు హాజరైన స్వామీజీని సాయి ట్రస్టు అధ్యక్షుడు విజయసాయికుమార్ కలిసి ట్రస్టు సేవాకార్యక్రమాలను గురించి వివరించారు. ట్రస్టు సభ్యులు నారాయణ, రాఘవ పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యం

గార్లదిన్నె, ఆగస్టు 22: మండలంలోని ఇల్లూరు గ్రామానికి చెందిన శ్రీనివాసులు కుమార్తె భావన అదృశ్యమైనట్లు ఎస్ఐ గౌస్‌మహ్మద్‌బాషా తెలిపారు. భావన తాడిపత్రిలోని సీవీ రామన్ కళశాలలో డిప్లొమా సెకండ్ ఇయర్ చదువుతోంది. నెలరోజుల నుంచి విద్యార్థిని ఇంట్లోనే ఉండేది. మంగళవారం తల్లిదండ్రులు పనులకు వెళ్లడంతో విద్యార్థిని కనిపించకుండా పోయింది. ఆమె కోసం తల్లిదండ్రులు బంధువుల వద్ద వెతికారు. ఆచూకీ లభించకపోవడంతో గురువారం గార్లదిన్నె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తల్లిదండ్రుల ఫిర్యాదు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దొంగలకు దేహశుద్ధి

ధర్మవరం రూరల్(కనగానపల్లి), ఆగస్టు 22: మండలంలోని గుదివాండ్లపల్లి గ్రామంలో బైకు దొంగలకు గ్రామస్థులు దేహశుద్ధి చేశారు. గురువారం స్థానికులు తెలిపిన మేరకు రామగిరి మండలంతో పాటు పేరూరు, గుదివాండ్లపల్లి గ్రామాల్లో ద్విచక్రవాహనాలను బుధవారం రాత్రి దొంగలించి తీసుకెళ్లుతుండగా మార్గమధ్యంలో సోమరవాండ్లపల్లి సమీపంలోకి వెళ్లగానే పెట్రోల్ అయిపోవడంతో వాహనాలు నిలిచిపోయాయి. అనుమానం వచ్చిన స్థానికులు వారిని ఎక్కడికి వెళ్లుతున్నారని ప్రశ్నించగా వారు పారిపోయేందుకు ప్రయత్నించారు. దొంగలలోని ఓ వ్యక్తినిపట్టుకుని దేహశుద్ధి చేసి కనగానపల్లి పోలీసులకు అప్పగించినట్లు స్థానికులు తెలిపారు. దీనిపై పోలీసులను వివరణ కోరగా నరేంద్ర అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని, దీనిపై విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు.

భార్యతో గొడవపడి వెళ్లిపోయిన భర్త

అనంతపురం క్రైం,ఆగస్టు 22: భార్యతో గొడవపడిన ఓ భర్త అలిగి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. రెండురోజులుగా ఆచూకీ లభ్యం కాకపోవడంతో అతని సోదరుడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అనంతపురం రూరల్ మండలం తాటిచర్లకు చెందిన అనిల్‌కుమార్ దంపతులు రెండు రోజుల క్రితం వాదులాడుకున్నారు. బుధవారం ఉదయం అనిల్‌కుమార్ ఇంటి నుంచి అదృశ్యమయ్యాడు. సెల్‌ఫోన్ సైతం ఇంట్లోనే ఉంచాడు. కుటుంబసభ్యులు అతని కోసం బంధువుల ఇళ్లలో ఆరా తీశారు. ఆచూకీ తెలియకపోవడంతో గురువారం అనంతపురం రూరల్ పోలీసులకు అనిల్‌కుమార్ అన్న ధనుంజయ ఫిర్యాదు చేశారు.

విద్యార్థుల ఆచూకీ లభ్యం

గార్లదిన్నె, ఆగస్టు 22: స్థానిక మైనార్టీ గురుకుల పాఠశాలలో అదృశ్యమై ముగ్గురు విద్యార్థుల ఆచూకీ లభ్యమైంది. ఆ వివరాలను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో శింగనమల సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐ మహమ్మద్‌గౌస్ బాషా విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఆత్మకూరుకు చెందిన ఇర్ఫాన్, కొత్తచెరువు మండలం కేశాపురానికి చెందిన అల్తాఫ్, కణేకల్లు మండలం ఉడేగోళానికి చెందిన నౌషాద్ ఈ ఏడాది గురుకుల పాఠశాలలో 8వ తరగతిలో చేరారు. బుధవారం సాయంత్రం విద్యార్థులు పాఠశాల నుంచి వెళ్లిపోయారు. విషయం తెలుసుకున్న ప్రిన్సిపాల్ ఆంజనేయుల నాయక్, తోటి ఉపాధ్యాయులు అదృశ్యమైన విద్యార్థుల కోసం గాలించారు. బుధవారం రాత్రి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పోలీసులు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టారు. అనంతపురం పట్టణంలో రాత్రి గస్తీ నిర్వహిస్తున్న పోలీసులకు గురువారం తెల్లవారుజామున కళ్యాణదుర్గం రోడ్డులోని రజాక్ ఫక్షన్ హల్ సమీపంలో గస్తీ నిర్వహించే పోలీసులకు విద్యార్థులు కనిపించారన్నారు. విద్యార్థులను స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మైనార్టీ పాఠశాల ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు అప్పగించినట్లు తెలిపారు. వారిని ఐసీడీఎస్ అధికారులకు అప్పగిస్తున్నట్ల తెలిపారు. జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.

సర్వజన ఆస్పత్రిలో భద్రతపై డీఎస్పీ, సీఐ చర్చ

అనంతపురం టౌన్, ఆగస్టు 22: జిల్లా సర్వజన ఆస్పత్రిలో భద్రతపై జిల్లా పోలీస్ యంత్రాంగం దృష్టి సారించింది. ఇప్పటికే కోల్‌కతాలో ఆస్పత్రిలో డ్యూటీలో ఉన్న మహిళా డాక్టర్‌ను దారుణంగా హత్యచేసిన ఘటన తీవ్ర ఆందోళనకు దారితీసింది. జిల్లాలోనూ జూనియర్ డాక్టర్లు, పీజీలు విధులు బహిష్కరించి నిరసనలు సాగిస్తున్నారు. సుప్రీంకోర్టుతో పాటు కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు ఆస్పత్రులలో మహిళా డాక్టర్ల భద్రతపై ప్రత్యేక చర్యలకు ఆదేశాలిచ్చాయి. ఈనేపత్యంలో గురువారం ఆస్పత్రిలో భద్రతాచర్యలు ఎలా చేపట్టాలో సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావుతో డీఎస్పీ ప్రతాప్, టుటౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్ కలిసి చర్చించారు. ఆస్పత్రిలో ఎన్ని విభాగాలు ఉన్నాయి, ఎంతమంది మహిళా డాక్టర్లు, సిబ్బంది ఉన్నారు, డ్యూటీలలో ఎంతమంది ఉండే అవకాశం ఉంది, ఆస్పత్రిలో సీసీకెమరాలు ఎన్ని ఉన్నాయి, ఎన్ని పనిచేస్తున్నాయి, సెక్యూరిటీగార్డ్స్ ఎంతమంది ఉన్నారు. వారు డ్యూటీ ఏవిధంగా చేస్తున్నారు తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎక్కడెక్కడ భద్రతా చర్యలు పటిష్ఠంగా ఉండాలో కూడా ఆలోచించారు. శుక్రవారం మళ్లీ ఆస్పత్రికి వచ్చి సెక్యూరిటీ గార్డ్స్, అవుట్ పోస్ట్ పోలీసులతో సమావేశమై పలు సూచనలు చేయనున్నారని సూపరింటెండెంట్ తెలిపారు.



సూపరింటెండెంట్‌తో చర్చిస్తున్న డీఎస్పీ, సీఐ

చెరువులకు చేరిన నీటిని పరిరక్షించాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్

అనంతపురం కల్చరల్, ఆగస్టు 22: జిల్లాలో మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలవల్ల 116 చెరువులు, వందలాది కుంటలు పొంగి పొర్లుతున్నాయని, ఈ నీటిని పరిరక్షించుకునేందుకు జిల్లా అధికార యంత్రాంగం పటిష్ఠ చర్యలు చేపట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు రాంభూపాల్ గురువారం ఒక ప్రకటనలో సూచించారు. గతేడాది ఖరీఫ్, రబీ సీజన్లలో కరువు పరిస్థితులేర్పడ్డాయన్నారు. భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని, ఈ సంవత్సరం మే నెలలో అధికార నివేదికలు తెలిపాయన్నారు. ఏప్రిల్, మే నెలల్లో గార్లదిన్నె, పుట్లూరు మండలాల్లో ట్యాంకర్లద్వారా చీనీ, అరటి పంటలను కాపాడుకునేందుకు రైతులు ప్రయత్నించారని గుర్తు చేశారు. ఈ ఏడాది జూలై నెలలో వర్షాలు రాకపోవడంతో పంటల సాగు తగ్గిందన్నారు. కర్ణాటకలో కురిసిన వర్షాలవల్ల తుంగభద్ర డ్యామ్ గేటు కొట్టుకుపోయి దాదాపు 40 టీఎంసీల నీరు సముద్రం పాలైందని, ఇలాంటి పరిస్థితుల్లో జిల్లాలో కురుస్తున్న వర్షాలవల్ల చెరువులు, కుంటలకు చేరుతున్న నీటిని పరిరక్షించుకునేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అదేవిధంగా చెరువులకు గండ్లు పడ డం, తెగిపోవడం వంటివాటివల్ల ఆ నీరు వృథా కాకుండా కాపాడాలని, ఇందుకు అవసరమైన నిధులను, సిబ్బందిని కేటాయించాలని కోరారు.

పాఠశాలల్లో శ్రమదానం



సిద్దరాంపురం పాఠశాలలో ఎర్రమట్టిని చదును చేస్తున్న దృశ్యం

బుక్కరాయసముద్రం, ఆగస్టు 22: ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ సొంత గ్రామమైన సిద్దరాంపురం ప్రభుత్వ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలల్లో వర్షం దాటికి క్రీడా మైదానం, పాఠశాల ఆవరణం వర్షపు నీరుతో నిండి పోయింది. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్న తరుణంలో ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రామలింగారెడ్డి సహకారంతో ఎర్రమట్టి తోలించి, గ్రామ ప్రజల సహకారంతో శ్రమదానం చేయించారు. రెండు పాఠశాలలో 50 ట్రాక్టర్ల మట్టిని తోలించి వర్షం నీరు కనిపించకుండా మట్టి వేయించారు. దీంతో ఉపాధ్యాయులు, పిల్లలు, తల్లితండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో పల్లెనిద్ర చేపట్టాలి

అనంతపురం సెంట్రల్, ఆగస్టు 22: ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో జిల్లాస్థాయి అధికారులు పల్లెనిద్ర కార్యక్రమాలు చేపట్టాలని గురువారం ఎమ్మార్పీఎస్ నాయకులు కలెక్టర్ వినోద్‌కుమార్‌ను కోరారు. రాయలసీమ జిల్లాల అధికార ప్రతినిధి అక్కులప్ప మాట్లాడుతూ గ్రామస్థాయిలో అనేకమంది ఎస్సీ, ఎస్టీలు పలు సమస్యలతో బాధపడుతున్నారని వాపోయారు. పరిష్కారంకోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం దక్కడంలేదన్నారు. జిల్లాస్థాయి అధికారులు ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో పల్లె నిద్ర కార్యక్రమాలు చేపడితే సమస్యలు తెలుసుకునే అవకాశముందన్నారు. నాయకులు వన్నూరప్ప, లక్ష్మణమూర్తి పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న అక్కులప్ప

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

రామగిరి, ఆగస్టు 22: మండలంలోని నసనకోట ప్రాథమిక పాఠశాలలో చిరంజీవి అభిమానులు ఆయన జన్మదినం సందర్భంగా విద్యార్థులకు గురువారం నోట్ పుస్తకాలు పంపిణీచేశారు. చిరంజీవి సాయం చేసేవారని ఆయన మార్గంలో తాము కూడా చేతనైన సాయం అందిస్తున్నట్లు వారు తెలిపారు. కేటీ రామాంజనేయులు, విజయ్‌కుమార్, ఉమాకాంత్, మురళీ పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలు అందజేస్తున్న చిరంజీవి అభిమానులు

కిరణ్‌కు టీడీపీ నుంచి ప్రశంసాపత్రం



ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రసంశాపత్రాన్ని అందుకుంటున్న కిరణ్

అనంతపురంరూరల్, ఆగస్టు 22: మండలంలోని పాములాయి గ్రామానికి చెందిన ఐటీడీపీ నాయకుడు కిరణ్‌రాయల్‌కు టీడీపీ యాప్‌లో కంటెంట్ షేర్‌లో ఉత్తమ స్థానం దక్కింది. బుధవారం టీడీపీ జాతీయ కార్యాలయం నుంచి అభినందనలతో కూడిన ప్రశంసాపత్రం కిరణ్‌కు వచ్చింది. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పరిటాల సునీత చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని అందుకున్నారు. మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, మండల ప్రధాన కార్యదర్శి పాము రాయి రఘు, చల్లానాయుడు పాల్గొన్నారు.

స్టాండింగ్ కమిటీ ఎన్నికకు నోటిఫికేషన్

అనంతపురం క్రైం, ఆగస్టు 22: నగరపాలిక స్టాండింగ్ కమిటీ ఎన్నికకు సంబంధించి నోటిఫికేషన్ షెడ్యూల్ కమిషనర్ వీవీఎస్ మూర్తి జారీ చేశారు. ఐదుగురు సభ్యులతో కమిటీని ఎన్నుకుంటారు. ఈనెల 22 నుంచి నామినేషన్లు స్వీకరిస్తారు. కార్పొరేషన్ కార్యాలయంలో ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు స్వీకరిస్తారు. 28న సాయంత్రం వాటిని ప్రచురిస్తారు. సెప్టెంబరు 1న నామినేషన్ల ఉపసంహరణ చేపడతారు. అదేరోజు పోటీ అభ్యర్థుల జాబితా ప్రకటిస్తారు. సెప్టెంబరు 5వ తేదీ ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహిస్తారు. మధ్యాహ్నం 3గంటలకు ఓట్ల లెక్కింపు ఉంటుంది. అదే రోజు ఫలితాలు వెల్లడిస్తారు.

బకాయిలు వసూలు చేయండి

నగర పరిధిలో ఇంటిపన్నులు, మున్సిపల్ షాపుల బాడుగ బకాయిలు వెంటనే వసూలు చేయాలని అడిషనల్ కమిషనర్ శ్రీహరిబాబు, డిప్యూటీ కమిషనర్‌లు ఆదేశించారు. గురువారం రెవెన్యూ విభాగం అధికారులతో వారు సమావేశమయ్యారు. ఇదివరకు పన్ను విధించని భవనాలకు వెంటనే విధించాలని స్పష్టం చేశారు. కొత్తూరు మున్సిపల్ కాంప్లెక్స్‌ను సందర్శించి పారిశుధ్య నిర్వహణ, లైటింగ్‌పై చర్యలు చేపట్టాలన్నారు.

ఫాగింగ్ చేయించండి

వర్షంతో బురదమయమైన ప్రాంతాలను వెంటనే శుభ్రంచేసి ఫాగింగ్ చేయించాలని అడిషనల్ కమిషనర్ శ్రీహరిబాబు సిబ్బందిని ఆదేశించారు. గురువారం నగరంలోని గౌరవ్‌గార్డెన్, రజకనగర్, జనశక్తినగర్ ప్రాంతాల్లో ఆయన పర్యటించారు. వంక ప్రాంతంలో నీరు వెళ్లడానికి అడ్డుగా ఉన్న చెత్తను తొలగించాలని డీఈ రవీంద్రరెడ్డి, పారిశుధ్య విభాగం సిబ్బందిని ఆదేశించారు.

సివిల్ సప్లై గోడౌన్ తనిఖీ

తాడిపత్రి, ఆగస్టు 22: మండలంలోని చిన్నపొలమడ గ్రామ సమీపంలో ఉన్న సివిల్‌సప్లై గోడౌన్‌ను సివిల్‌సప్లై జిల్లా మేనేజర్ రమేష్‌రెడ్డి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను, స్టాక్‌ను పరిశీలించారు. రేషన్ బియ్యం తూకాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉంచుకోవాలని గోడౌన్ సిబ్బందిని ఆదేశించారు. అక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. తూకాల్లో తేడాలు ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఎవరైనా తప్పులు చేస్తే ఉపేక్షించేది లేదని తెలిపారు. ఆయన వెంట సివిల్‌సప్లై అధికారి రాజా ఉన్నారు.

నేడు గ్రామసభలు

రాయదుర్గం రూరల్: ప్రభుత్వం 2024-25వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి పనుల గుర్తింపునకు గాను శుక్రవారం మండలంలోని గ్రామ పంచాయతీల్లో గ్రామసభలను నిర్వహించనున్నట్లు మండల ప్రత్యేక అధికారి నాగరాజురావు తెలిపారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఆయన పంచాయితీ కార్యదర్శులు, ఉపాధి హామీ అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. 15 పంచాయతీల్లో గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పంచాయితీ కార్యదర్శులతో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామస్థులు పాల్గొనాలని కోరారు. ఎంపీడీఓ రంగనాయకులు తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు: మండలవ్యాప్తంగా ఉపాధి హామీ పనుల గుర్తింపునకు శుక్రవారం గ్రామసభలు నిర్వహించనున్నట్లు ఏపీఓ చెన్నకేశవులు ప్రకటనలో తెలిపారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామపంచాయతీల్లో ఒకరోజు మాత్రమే అధికారులు గ్రామసభలు నిర్వహించి 2023- 2024వ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధిహామీ పనులు గుర్తిస్తామన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

పుట్లూరు, ఆగస్టు 22: మండలంలోని నారాయణరెడ్డిపల్లి గ్రామంలో రెండురోజులక్రితం కురిసిన భారీవర్షానికి నష్టపోయిన రామాంజనేయులు కుటుంబానికి టీడీపీ మండల నాయకులు బాలాపురం ఓబులనాయుడు, నాగరంగయ్య గురువారం నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా పదిరోజులు సరిపడా నిత్యావసర సరుకులను అందించినట్లు వారు తెలిపారు.

పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలి

ఉరవకొండ, ఆగస్టు 22: పెండింగ్‌లో ఉన్న వేతనాలు వెంటనే చెల్లించాలని సత్యసాయి తాగునీటి ప్రాజెక్టు కార్మికులు డిమాండ్ చేశారు. వజ్రకరూరు మండలంలోని కొనకొండ్ల సత్యసాయి మంచి నీటి పథకం వద్ద గురువారం వారు ఈ మేరకు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తమకు ఆరు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదన్నారు. పీఎఫ్, ఈఎస్ఐ కూడా కట్టలేదన్నారు. వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులైనా చొరవచూపి వేతనాలు మంజూరు చేయాలన్నారు. లేకపోతే సమ్మెలోకి వెళతామని హెచ్చరించారు.

బహిరంగ ప్రకటన
ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడమేమనగా నా క్లయింట్ అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, బ్రాంచ్-2 అనంతపురం వారు క్రింది తెలిపిన ఆస్తి తాకట్టుపై మంగల లక్ష్మీ నరసమ్మ W/o మంగల నారాయణ D.No:1-2-29, ఇందిరాగాంధీనగర్, అనంతపురం వారికి ఋణం ఇవ్వదలచుకున్నారు దీనిపై ఎవ్వరికైనా అభ్యంతరాలు, తకరార్లు ఉన్న యెడల7 రోజుల లోపు నాకు గానీ నా క్లయింట్‌కు గానీ తెలుపగలరు.
షెడ్యూలు
అనంతపురం రి॥డి॥ అనంతపురం సబ్ రి॥డి॥కి చేరిన అనంతపురం నగర పాలక సంస్థ ఏరియా పరిధిలోని సర్వేనెం.121/1C లో 2.5 సెంట్ల భూమి వివరం
చెక్కుబందీ:తూర్పు: మంగల లక్ష్మీ నరసమ్మ, మంగల నారాయణలకు చెందిన మిగిలిన భూమి, పడమర: ముస్లింల స్మశాన వాటిక, ఉత్తరం: 15 అడుగుల రోడ్డు, దక్షిణం: పద్మావతి ఖాళీ స్థలం.
Y.రామేశ్వర రెడ్డి, అడ్వకేట్, ATP Cell:9440565907

బహిరంగ ప్రకటన
ఇందుమూలంగా యావన్మందికి తెలియ జేయడమేమనగా నా క్లయింట్ అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, బ్రాంచ్-2 అనంతపురం వారు క్రింది తెలిపిన ఆస్తి తాకట్టుపై కుంచప అమర్నాథ్ S/o లేట్ కుంచప శంకర్, D.No:1-8, C.బండమీద పల్లి గ్రామం, శింగనమల మండలం అనంతపురం జిల్లా వారికి ఋణం ఇవ్వదలచుకున్నారు దీనిపై ఎవ్వరికైనా అభ్యంతరాలు, తకరార్లు ఉన్న యెడల7 రోజుల లోపు నాకు గానీ నా క్లయింట్‌కు గానీ తెలుపగలరు.
షెడ్యూలు
అనంతపురం రి॥డి॥ శింగనమల సబ్ రి॥డి॥కి చేరిన శింగనమల మండలం చక్రాయపేట గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వేనెం.98లో D.No.2-80 ఇల్లు.
చెక్కుబందీ:తూర్పు: శంకరయ్య గారి ఇల్లు, పడమర: C.C రోడ్డు, ఉత్తరం: రామచంద్ర గారి ఇల్లు, దక్షిణం: రస్తా.
Y.రామేశ్వర రెడ్డి, అడ్వకేట్, ATP Cell:9440565907

బహిరంగ ప్రకటన
ఇందుమూలంగా యావన్మందికి తెలియ జేయడమేమనగా నా క్లయింట్ అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, బ్రాంచ్-2 అనంతపురం వారు క్రింది తెలిపిన ఆస్తి తాకట్టుపై బండారి సరస్వతి W/o బండారి గోవింద రాజులు, D.No:1-567-A79, టీచర్స్ కాలనీ, ముదిగుబ్బ గ్రామం మరియు మం॥, శ్రీసత్యసాయి జిల్లా వారికి ఋణం ఇవ్వదలచుకున్నారు దీనిపై ఎవ్వరికైనా అభ్యంతరాలు, తకరార్లు ఉన్న యెడల7 రోజుల లోపు నాకు గానీ నా క్లయింట్‌కు గానీ తెలుపగలరు.
షెడ్యూలు
అనంతపురం రి॥డి॥ అనంతపురం రూరల్ సబ్ రి॥డి॥కి చేరిన రాప్తాడు మండలం హంపాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వేనెం.41లో ప్లాట్‌నెం.277.
చెక్కుబందీ:తూర్పు: 40అ॥వెడల్పుగల రోడ్డు, పడమర:ప్లాట్‌నెం.250,ఉత్తరం: 40అ॥ వెడల్పు గల రోడ్డు,దక్షిణం: ఇదే ప్లాటుపైకి మిగతా ప్లాటు.
Y.రామేశ్వర రెడ్డి, అడ్వకేట్, ATP Cell:9440565907

PUBLIC NOTICE
UNDER the instructions of my Client M/s. Shriram Finance Limited, Chennai, Branch at KADIRI. I issue the following notice to general public. My Clients intends to grant loan to Smt. D.Geetharani D/o Arikeri Rajasekhar Reddy, H.No: 17/813-B-4, Thilak Nagar, Guntakal, Anantha puram District. by keeping the below mentioned property of his, as Security by way of Registered Mortgage. As such if anyone have any claims, charges, Mortgages, Sale agreements, Court attachments, Court disputes etc., shall be informed to the address mentioned below in writing within 7 days from the date of this notice. Otherwise later objections will not bind on my client in this regard.
SCHEDULE
Property situated in Plot No.40 of LP No. 189/81 in Sy.No.279-C1A, 280-C to an Total extent of 266.67 Sq. yds situated at Thimmanacheria Village fields, Eastern side of V.V. Nagar residential area bearing Door No:12/517-R2, Assessment No: 1003027993 within SRD of Guntakal and RD of Ananthapuram. Boundaries: East: House of TTE Narayanappa, Jayarambabu in Plot No.44, West: Municipal Road, North: House of D. Niranjan in Plot No.39, South: Property of Sreenath Reddy,
M.G. BHASKAR GOWD
Advocate, Guntakal.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలు

కళ్యాణదుర్గం, ఆగస్టు 22: మండలంలోని కుర్లపల్లి సమీపాన జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. కంబదూరు మండలం చెర్లోపల్లికి చెందిన ప్రకాష్, కళ్యాణదుర్గం మండలం దురదకుంటకు చెందిన నరేష్ గురువారం బైక్‌లో కంబదూరు నుంచి కళ్యాణదుర్గంకు వస్తున్నారు. మార్గంమధ్యలోని కుర్లపల్లి వద్ద ఎదురుగా వస్తున్న బొలేరో వాహనం ప్రమాదవశాత్తూ ఢీ కొంది. ప్రమాదంలో ఆ ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వారిని కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం బాటిళ్ల స్వాధీనం

గుత్తిరూరల్, ఆగస్టు 22: మండలంలోని బాచుపల్లి సమీపంలో బాట సుంకులమ్మ ఆలయం వద్ద మద్యంను అక్రమంగా అమ్ముతున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు గురువారం దాడులు చేశారు. అక్కడ మద్యం అమ్ముతున్న రామోహన్, మునీంద్ర అనే ఇద్దరిని అరెస్టు చేసి, వారి వద్ద నుంచి 20 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ నబీరసూల్ తెలిపారు. వారిపై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

మామపై అల్లుడి దాడి

తాడిపత్రి, ఆగస్టు 22: పట్టణంలోని సుంకులమ్మపాలెంకు చెందిన దాసుపై అల్లుడు చిరంజీవి కొడవలితో దాడిచేసి గాయపరిచాడని పట్టణ పోలీసులు తెలిపారు. యాడికి మండలం నగరూరుకు చెందిన చిరంజీవికి నాలుగేళ్ల క్రితం దాసు తన కుమార్తె మమతను ఇచ్చి వివాహం చేశాడు. కొంతకాలంగా చిరంజీవి వేధిస్తుండడంతో మమత పుట్టింటికి చేరుకుంది. దీంతో గురువారం చిరంజీవి మామ దాసుతో గొడవ పెట్టుకుని కొడవలితో దాడి చేశాడు. దాసుకు చేతికి గాయమైంది. చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితుడి ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.



అనుంపల్లి చెరువు సైడ్ వాల్‌కు మరమ్మతు చేస్తున్న దృశ్యం



జక్కలచెరువు గ్రామ చెరువుకు గండిని పూడ్చివేస్తూ..

చెరువులకు భారీగా వర్షపునీరు

- కూలిన అనుంపల్లి చెరువు సైడ్‌వాల్
- రామగిరి చెరువుకు గండి
- మరమ్మతులు చేయిస్తున్న గుమ్మనూరు ఈశ్వర్

పామిడి, ఆగస్టు 22 : గత మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని చెరువులు జలకళను సంతరించుకుని నిండుకుండలా ఉన్నాయి. ఏళ్లుగా నీటికి నోచుకోని చెరువుల్లో ఈ వర్షాలకు భారీగా నీరు చేరుతోంది. ప్రధానంగా రామగిరి, అనుంపల్లి చెరువులు ఆయకట్టు చెరువులుగా ఉన్నాయి. అనుంపల్లి చెరువు దాదాపు 0.25 టీఎంసీల నీటి సామర్థ్యాన్ని కలిగి ఉందని అధికారులు తెలియజేస్తున్నారు. ఈ చెరువు కింద దాదాపు 300 ఎకరాలు ఆయకట్టు ఉన్నట్లు తెలుస్తోంది. కాగా నీరు అధికమై రోడ్డు పక్కన గల సైడ్ వాల్ కూలిపోయింది. దీంతో ఎమ్మెల్యే జయరాం తనయుడు గుమ్మనూరు ఈశ్వర్ రాళ్లు, మట్టితోలి మరమ్మతు పనులు చేయిస్తున్నారు. అదేవిధంగా రామగిరి చెరువు సుమారు 0.28 టీఎంసీ నీటి సామర్థ్యం ఉంది. దాదాపు ఎనిమిదేళ్లుగా చెరువు పూర్తిస్థాయిలో నిండలేదు. ఈ ఏడాది వర్షాలకు చెరువుకు జలకళ వచ్చింది. ఈ చెరువు కింద దాదాపు 350 ఎకరాల ఆయకట్టు ఉంది. చెరువుకు చిన్నపాటి గండిపడడంతో మరమ్మతు పనులు చేపడుతున్నారు.

జక్కలచెరువు గ్రామ చెరువుకు గండి

గుత్తిరూరల్: మండలంలోని మూడు రోజులగా కురుస్తున్న వర్షాలకు మూడు చెరువులు నిండి జలకళను సంతరించుకున్నాయి. అయితే జక్కచెరువు గ్రామ చెరువుకు గండి పడింది. మమూడురు, బ్రహ్మణపల్లి, యర్రగుడి చెరువులు మరువ పారుతున్నాయి. జక్కలచెరువు గ్రామ చెరువుకు గండి పడడంతో రెండు రోజుల నుంచి ఇరుగేషన్ అధికారులు మరమ్మతులు చేస్తున్నారు.

భద్రతను పరిశీలించిన ఏఎస్పీ



ఎమ్మెల్యే నివాసం వద్ద భద్రతను పరిశీలిస్తున్న ఏఎస్పీ

తాడిపత్రి, ఆగస్టు22: పట్టణంలో దాడులు చేసుకున్న సంఘటన దృష్ట్యా ఏర్పాటుచేసిన పికెట్‌లను జిల్లా అడిషనల్ ఎస్పీ రమణమూర్తి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రస్తుత పరిస్థితి గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఏమైనా సమస్యలు తలెత్తితే వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. అనుమానితులను తనిఖీలు చేయాలన్నారు. విధుల్లో అలసత్వం వహించరాదని పికెటింగ్ సిబ్బందిని హెచ్చరించారు. ఎమ్మెల్యే జేసీ అశ్మిత్‌రెడ్డి నివాసం, మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి నివాసం వద్ద ఉన్న పికెట్ కేంద్రాల సిబ్బందితో వివరాలను ఆరాతీశారు. ఆయన వెంట డీఎస్పీ వెంకటశివారెడ్డి, సీఐలు నాగేంద్రప్రసాద్, లక్ష్మికాంత్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలి

- పోలీస్‌స్టేషన్ వద్ద బాధితుడు, అతడి బంధువుల నిరసన



పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం


యాడికి, ఆగస్టు 22: మండలంలోని బోయరెడ్డిపల్లిలో ఇరువర్గాల గొడవకు సంబంధించి దాడులకు పాల్పడిన వ్యక్తులను తక్షణమే అరెస్టు చేయాలని కోరుతూ బాధితుడు చింతకాయల రవి, అతని బంధువులు గురువారం మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. వీరికి వాల్మీకి సంఘం నాయకులు లింగమయ్య తదితరులు మద్దతు పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 15న బోయరెడ్డిపల్లిలో రస్తా విషయమై ఇరువర్గాలు దాడులు చేసుకున్నారని తెలిపారు. ఈ ఘటనలో చింతకాయల రవి తీవ్రంగా గాయపడ్డాడన్నారు. అతను హైదరాబాద్‌లో చికిత్స పొంది డిశ్చార్జ్ అయి వచ్చాడని తెలిపారు. దీనిపై కేసు నమోదుచేసి 8రోజులు అవుతున్నా నిందితులను ఎందుకు అరెస్ట్ చేయడం లేదని వాపోయారు. పోలీసులకు నిర్లక్ష్యవైఖరి తగదని తెలిపారు. ఇక్కడి పోలీసులు మాకు న్యాయం చేయరని తాడిపత్రి డీఎస్పీ వద్దకు వెళతామని అక్కడకు వెళ్లారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ

పామిడి, ఆగస్టు 22 : పట్టణంలోని నారాయణస్వామి వీధి(సంతమార్కెట్)లో తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి బొల్లు శ్రీనివాసరెడ్డి గురువారం విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. మూడు రోజులుగా కురిసిన వర్షాలకు ఆ వీధిలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటుండడంతో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం, టీడీపీ మండల ఇన్‌చార్జి గుమ్మనూరు ఈశ్వర్ ఆదేశాల మేరకు బొల్లు శ్రీనివాసరెడ్డి నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరింపజేశారు. కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతుల జిల్లా అధ్యక్షుడు అప్పన్నగారి కుమార్, ఎస్సీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి నల్లబోతుల శ్రీనివాసులు, ముస్లిం మైనార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి మహమ్మద్ రఫీ, టీడీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు బొమ్మా మోహన్‌కృష్ణ, నాయకుడు శంకర్ పాల్గొన్నారు.

తెగిన ముద్దినాయనపల్లి చెరువు

- ఆయకట్టుదారుల ఆనందం ఆవిరి



ముద్దినాయనపల్లి చెరువు నుంచి వృథాగా పోతున్న నీరు

కళ్యాణదుర్గం, ఆగస్టు 22: మండలంలోని ముద్దినాయనపల్లి చెరువు ఇటీవల కురిసిన వర్షానికి పూర్తిగా నిండింది. దీంతో ఆయకట్టు రైతుల ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. అయితే అంతలోనే వారి ఆనందం అంతా ఆవిరైంది. చెరువు గురువారం తెగిపోవడంతో చెరువులో చేరిన నీరంతా వృథాగా వెళ్లిపోయింది. సుమారు 30 ఏళ్ల తర్వాత చెరువు నిండిందని ఎంతో ఆనందంగా ఉన్న రైతులు ఈ ఘటనతో నిరాశ చెందారు. బుధవారం చెరువుకు కొద్దిపాటి గండ్లు పడ్డాయి. చివరికి గురువారం చెరువు పూర్తిగా తెగిపోయింది. పరిశీలించి మరమ్మతులకు చర్యలు చేపడతామని ఇరిగేషన్ , రెవెన్యూ అధికారులు తెలిపారు.

వైభవంగా ఉత్తరారాధన

తాడిపత్రి, ఆగస్టు 22: పట్టణంలోని రాఘవేంద్రస్వామి ఆలయంలో నాలుగు రోజులుగా జరుగుతున్న ఆరాధనోత్సవాల్లో భాగంగా గురువారం స్వామివారికి ఉత్తరారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు స్వామివారి బృందావనానికి పంచామృతాభిషేకం, అష్టోత్తర క్షీరాభిషేకం, పాదపూజ, కనక మహాపూజ, తులసీ అర్చన, మహామంగళహారతి కార్యక్రమాలు జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి బృందావనాన్ని దర్శించుకున్నారు.

సంగమేశ్వరుడిని దర్శించుకున్న మంత్రి కేశవ్



సంగమేశ్వరుడి ఆలయంలో మంత్రి పయ్యావుల కేశవ్

కూడేరు, ఆగస్టు 22: మండలకేంద్రంలోని జోడులింగాల సంగమేశ్వరస్వామిని రాష్ట్ర ఆర్థిక శాఖా మంత్రి పయ్యావుల కేశవ్ గురువారం దర్శించుకున్నారు. సంగమేశ్వర స్వామి ఆలయంలో జరిగిన ఓ కార్యక్రమానికి మంత్రి హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామి వారిని దర్శించుకుని పూజలు చేయించారు. తొలుత ఆయనకు ఆలయ అర్చకుల ఘనస్వాగతం పలికారు. మంత్రి వెంట టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీధర్ చౌదరి, బీసీ సెల్ రాష్ట్ర నాయకుడు కురుగుంట బ్రహ్మయ్య మాజీ కన్వీనర్ మురళి, బీసీ సెల్ నాయకులు విజయభాస్కర్ గౌడ్, కురుగుంట ప్రసాద్ ఉన్నారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

బొమ్మనహళ్, ఆగస్టు 22: మండలంలోని చంద్రగిరి గ్రామ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు గురువారం యూనిఫాం పంపిణీ చేశారు. స్కూల్ కమిటీ చైర్మన్ సులేమాన్ బాషా చేతుల మీదుగా అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన యూనిఫాం, భోజనం అందిచడంతోపాటు నాణ్యమైన విద్యను బోధించడం జరుగుతుందని తెలిపారు. తల్లిదండ్రులు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పేందుకు ఆసక్తి చూపాలని కోరారు. హెచ్‌ఎం నిర్మల, టీడీపీ నాయకులు చంద్రశేఖర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, ధనంజయరెడ్డి, పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ డీలర్ల సమావేశం

బొమ్మనహళ్, ఆగస్టు 22: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం తహసీల్దార్ మునివేలు మండలంలోని రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రతి నెలా 1 నుంచి 16వ తేదీ వరకు లబ్ధిదారులు ఎప్పుడు వచ్చినా డీలర్లు అందుబాటులో ఉండి రేషన్ సరుకులను అందించాలన్నారు. ఎవరికీ ఇబ్బంది కలిగించకుండా సరుకులను పంపిణీ చేయాలన్నారు. స్టాక్‌పాయింట్ నుంచి రేషన్ బియ్యం తూకాలు తక్కువగా వస్తున్నాయని కొందరు డీలర్లు తహసీల్దార్ దృష్టికి తీసుకొచ్చారు. స్టాక్ పాయింట్ వారితో మాట్లాడి బియ్యం తక్కువ రాకుండా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ తెలిపారు. డీటీ సుజాత, ఆర్ఐ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పెళ్లైన మూడు నెలలకే మృతి

బొమ్మనహళ్, ఆగస్టు 22: కొత్తగా వివాహమైన యువకుడు గుండెపోటుతో మృతి చెందడం మండలంలోని సింగనహళ్లి గ్రామంలో విషాదం కలిగించింది. గ్రామానికి చెందిన నవీన్ (22) బుధవారం రాత్రి ఛాతీలో నొప్పిగా ఉందని తెలపడంతో కుటుంబ సభ్యులు వెంటనే బళ్లారి ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం వేకువ జామున మృతి చెందినట్లు బంధువులు తెలిపారు. నవీన్‌కు మూడు నెలల క్రితమే కణేకల్లు మండలం బెణేకల్లు గ్రామానికి చెందిన నందినితో వివాహమైంది. పెళ్లి అయిన కొద్ది కాలానికే అతను మృతి చెందడంతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం

కళ్యాణదుర్గం, ఆగస్టు 22 : బాల్య వివాహాలను నిర్మూలిద్దామని , ఇది అందరి బాధ్యత అని జిల్లా లీగల్ సెల్స్ అథారిటీ, సీనియర్ సివిల్ న్యాయాధికారి శివప్రసాద్ సూచించారు. మండలంలోని నుసికొట్టాల తండాలో గురువారం గిరిజన సంక్షేమ శాఖ, జిల్లా వైద్యఆరోగ్య శాఖ, న్యాయశాఖ సంయుక్త ఆధ్వర్యంలో ప్రభుత్వ సేవా పథకాలపై గ్రామ ప్రజలకు అవగాహన సదస్సు కల్పించారు. ఈ సందర్భంగా న్యాయాధికారి మాట్లాడుతూ బాల్య వివాహాల వలన జరిగే అనర్థాలపై వివరించారు. కనుక వాటిని అరికట్టడానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని కోరారు. లాగే భూ తగాదాలు, న్యాయపరమైన అంశాలపై కూడా అవగాహన కల్పించారు. మండల అధికారులు, గ్రామప్రజాప్రతినిధులు తదిరులు పాల్గొన్నారు.

తేనెటీగల దాడిలో రైతుకు గాయాలు

గుత్తి రూరల్, ఆగస్టు 22: గుంతకల్లు మండలం గొల్లలదొడ్డి గ్రామశివారులోని పొలంలో ఓ రైతు తేనేటీగల దాడిలో గాయపడ్డాడు. గుత్తి మండలం పూలకుంట గ్రామానికి చెందిన రైతు మల్లికార్జున గొల్లలదొడ్డి సమీపంలోని పొలంలో గురువారం పనులు చేసుకుంటుండగా.. పెద్ద తేనేటీగలు ఒక్కసారిగా దాడి చేశాయి. దీంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. పక్క పొలాల రైతులు గమనించి వెంటనే గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

గుత్తిరూరల్, ఆగస్టు 22: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిని అత్యాచారం, హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ పట్టణంలో గురువారం పలు సంఘాల నాయకులు, విద్యార్థులు భారీ ర్యాలీ చేపట్టారు. గాంధీ సర్కిల్ నుంచి ప్రారంభమైన ర్యాలీ కోట వీధి, ఎన్‌టీఆర్ సర్కిల్ మీదుగా రాజీవ్‌గాంధీ సర్కిల్ వరకు కొనసాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జయరాం సోదరుడు గుమ్మనూరు నారాయణ మాట్లాడుతూ.. వైద్యురాలిపై అత్యాచారం, హత్య చేసిన దుండగుల ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమం లో జర్నలిస్టులు, ప్రజా సంఘాల నాయకులు, ప్రైవేట్ కళాశాలల అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజాసంఘాల నాయకులు, విద్యార్థులు

కృష్ణాజలాలకు ఎమ్మెల్యే జలహారతి



గడ్డంవారిపల్లి చెరువు వద్ద జలహారతి ఇస్తున్న ఎమ్మెల్యే శ్రావణిశ్రీ

యల్లనూరు, ఆగస్టు 22: మండలకేంద్రంలోని చెరువుతో పాటు గడ్డంవారిపల్లి చెరువుకు ఎత్తిపోతల పథకం ద్వారా కృష్ణాజలాలు వచ్చి చేరుతున్నాయి. దీంతో గురువారం సాయంత్రం ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఆ చెరువుల వద్దకు చేరుకుని పూజలు చేసి జలహారతి ఇచ్చారు. అలాగే కోడిమూర్తి పంప్‌హౌస్ వద్ద పూజలు నిర్వహించి రెండో పంపును ప్రారంభించారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఈఈ కృష్ణారెడ్డి, మెగా కంపెనీ ఇన్‌చార్జి నిత్యానందరెడ్డి, టీడీపీ మండల కన్వీనర్ రామాంజనేయులు, నాయకులు కోడిమూర్తి మోహన్‌నాయుడు, అచ్యుతాపురం జనార్దన్‌రెడ్డి, జంగంపల్లి సర్పంచు కుల్లాయప్పనాయుడు తదితరులు పాల్గొన్నారు.

అంతర్ రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

పీలేరు, ఆగస్టు 22: ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో దోపిడీలు, చోరీలకు పాల్పడుతున్న అంతర్ రాష్ట్ర ముఠాలోని ఆరుగురిని అరెస్టు చేసినట్లు అన్నమయ్య జిల్లా పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ తెలిపారు. పీలేరు అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆయన వారి అరెస్టును చూపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అనంతపురం జిల్లా ఉరవకొండ మండలం లట్టవరానికి చెందిన ఎస్.రెహ్మాన్, సయ్యద్ రఫీ, సయ్యద్ హుస్సేన్ బాషా, అనంతపురం పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీకి చెందిన సయ్యద్ మహమ్మద్ హుస్సేన్, సయ్యద్ సలీం, అలియాస్ సయ్యద్ టోపీ, షేక్ మస్తాన్ అంతర్ రాష్ట్ర ముఠా నాయకులైన గుంతకల్లుకు చెందిన సాగర్, అతడి బావమరిది సాచి, శ్యామ్‌ల నేతృత్వంలో ఒంటరిగా ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దోపిడీలకు పాల్పడేవారు. ఈ క్రమంలో వారందరూ గత నెల 23వ తేదీన పీలేరు-మదనపల్లె మార్గంలోని హుమయూన్ ఫంక్షన్ హాలు వద్ద ఒంటరిగా ఉన్న జెహరాబీ ఇంటిలోకి చొరబడి ఆమెపై దాడి చేసి, బీరువాలోని బంగారు నగలు, నగదు దోచుకెళ్లారు. అక్కడి నుంచి పీలేరు-రాయచోటి మార్గంలోని గిరినాయుడు ఇంటిలోకి చొరబడాలని ప్రయత్నించారు. గిరినాయుడు, అతడి కుటుంబసభ్యులపై కత్తులు, తుపాకులతో దాడి చేసేందుకు ప్రయత్నం చేయగా.. వారు తిరగబడడంతో అక్కడి నుంచి పారిపోయారు. ఆ మరుసటి రోజు కర్ణాటక రాష్ట్రంలోని గౌనిపల్లె, 25వ తేదీన విజయపుర, నందగుడి ప్రాంతాల్లో ఇదే విధంగా ఒంటరి ఇళ్లలోని వారిపై దాడి చేసి దోపిడీలకు పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో దోపిడీల్లో దొరికిన సొమ్ము పంపకాలు, వాటాల్లో తేడాల కారణంగా చెలరేగిన గొడవల్లో ఈనెల 9వ తేదీ కర్నూలు జిల్లా పాణ్యం సమీపంలో పిస్టల్‌తో శ్యామ్‌ను సాగర్ కాల్చి చంపేశాడు. ఆ కేసులో సాగర్‌ను అదుపులోకి తీసుకున్న పాణ్యం పోలీసులకు వారి నేరచరిత్ర తెలిసింది. దీంతో వారు అతడిని హత్య కేసులో అరెస్టు చేసి మిగతా నేరాల గురించి ఆయా పోలీసుస్టేషన్‌లకు సమాచారం అందించారు. దీంతో పీలేరు పోలీసులు కూడా అప్రమత్తమై ఆ ముఠాలోని సభ్యుల కోసం గాలింపు చర్యలు ఉధృతం చేశారు. అలా ఆ ముఠా సభ్యులు మరోమారు దొంగతనాలు చేసేందుకు పీలేరుకు వచ్చినట్లు రహస్య సమాచారం అందడంతో జిల్లా ఉన్నతాధికారులకు సమాచారం అందించి పీలేరు-మదనపల్లె మార్గంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వెనుక ప్రాంతంలో తచ్చాడుతున్న ఆరుగురిని అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ.95 వేల విలువజేసే 19 గ్రాముల బంగారు ఆభరణాలు, 3 బైక్‌లు, 5 సెల్‌ఫోన్లు, 6 కత్తులు స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు. ఎస్ఐ బాలకృష్ణ, సిబ్బంది, పాల్గొన్నారు.

ప్రకటన
C.ఆంజనేయులు @ C. రామాంజనేయులు S/o చాకలి హనుమంతు, D.No.6/900, భాగ్యనగర్, గుంతకల్లు, గుంతకల్లు మండలం వారి సంబంధించిన గుంతకల్లులో తిమ్మనచెర్ల గ్రామ పొలంలో సర్వే నెం.400 లో గుంతకల్లు మున్సిపాలిటీ పరిధిలో D.No.900-111కు దక్షిణ దిశన గల 94.55 గజాల స్థలాన్ని గుంతకల్లు శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ నందు తాకట్టు పెట్టడం జరుగుతున్నది. ఈ ఆస్తి పైన ఎవరికైనా అక్షేపణలు ఉన్నయెడల గుంత కల్లు శ్రీరామ్ చిట్స్ బ్రాంచ్ మేనేజర్‌ను సంప్రదించగలరు.
హద్దులు:తూర్పు:ఆచారిఇల్లు, పడమర:శాంతమ్మఇల్లు,ఉత్తరం: బి.సి.నారాయణ ఇల్లు, దక్షిణము: రోడ్డు.
M.G. భాస్కర్‌గౌడ్, అడ్వకేట్, గుంతకల్లు

వేరుశనగ పొలాల పరిశీలన

ఉరవకొండ, ఆగస్టు 22: మండలంలోని కోనాపురం గ్రామంలో వేరుశనగ పొలాలను వ్యవసాయధికారి శుభకర్ గురువారం పరిశీలించారు. అధికవర్షపాతం నమోదైనందున పొటాషియం నైట్రేట్‌ను 5గ్రాములకు 1లీటర్ నీటిని కలిపి పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు. పైరు 50రోజుల దశలో ఉంటే ఎకరాకు 200కేజీల జిప్సంను చల్లుకోవాలన్నారు. తద్వార కాయలు నాణ్యతగా ఉంటాయన్నారు.

అదృశ్యమైన మహిళ మృతి

- చెరువులో శవమై తేలిన వైనం

కళ్యాణదుర్గం, ఆగస్టు 22: మూడు రోజుల క్రితం అదృశ్యమైన మండలంలోని హులికల్లు గ్రామానికి చెందిన అనిత (26) గురువారం ఉదయం అదే గ్రామ చెరువులో శవమై తేలింది. ఆంజనేయులు భార్య అనిత మూడు రోజుల క్రితం గ్రామ సమీపంలోని చెరువు వద్ద కు పశువులను మేపడానికి వెళ్లింది. అయితే సాయంత్రం కేవలం పశువులు మాత్రమే ఇంటికి చేరాయి. అనిత రా లేదు. దీంతో భర్త పలు చోట్ల గాలించినా ఆచూకీ తెలియరాలేదు. చివరికి బుధవారం తన భార్య అదృశ్యమైందని, ఆచూకీని గుర్తించాలని కళ్యాణదుర్గం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా గురువారం ఉదయం చెరువులో ఆమె శవమై తేలింది. ప్రమాదవశాత్తూ చెరువులోకి పడి మృతి చెంది ఉంటుందని గుర్తించారు. మృతురాలికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బావిలో పడి వృద్ధుడి మృతి

కుందుర్పి, ఆగస్టు 22: మండల కేంద్రానికి చెందిన బోయ రంగస్వామి (60) అనే వృద్ధుడు ప్రమాదవశాత్తూ బావిలో పడి మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం వెలుగు చూసింది. రంగస్వామి కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. కాగా బుధవారం ఉదయం వ్యవసాయ పనులకు నిమిత్తం తన తోటకు వెళ్లిన ఆయన పక్కనే ఉన్న వ్యవసాయ బావి దగ్గరకు వెళ్లాడు. అక్కడ ప్రమాదవశాత్తూ కాలు జారీ అందులోకి పడిపోయాడు. సాయంత్రమైనా ఇంటికి రాకపోవడంతో కుమారుడు విజయ్ పలు చోట్ల గాలించినా.. ఆచూకీ లభ్యం కాలేదు. చివరికి గురువారం ఉదయం బావిలో శవమై కనిపించాడు. తోటి కూలీలు గమనించి కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. మృతుడికి భార్యలు కెంచమ్మ, వసంతమ్మ, కుమారుడు విజయ్ ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

పారిశుధ్య చర్యలు చేపట్టండి

తాడిపత్రి, ఆగస్టు 22: మండలంలోని కోమలిగ్రామంలో పారిశుద్ధ్యం సరిగా లేకపోవడంతో ప్రజలు అనారోగ్యం బారిన పడుతున్నారని, సంబంధితశాఖ అధికారులు పారిశుధ్య పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ గ్రామస్థులు పలువురు ఎంపీడీఓకు వినతిపత్రం అందజేశారు. పట్టణంలో గురువారం వారు తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్య పనులు చేయాలని సర్పంచు ఈశ్వరమ్మకు తెలిపితే.. ఆమె పట్టించుకోకపోగా ఆగ్రహం వ్యక్తం చేస్తోందన్నారు. పంచాయతీ కార్యదర్శి ప్రతాప్‌రాజు దృష్టికి తీసుకువెళ్లగా సర్పంచు ఏమి చెబితే అదే చేస్తానని చెప్పాడన్నారు. మీరైనా పారిశుధ్య పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో సుంకర నాగేంద్ర, పెద్దిరాజు , రామాంజనేయులు, రాజశేఖర్, వెంకటప్ప, నాగరాజు, శ్రీనివాసులు ఉన్నారు.

మరుగుదొడ్లను ఫొటో తీసే బాధ్యత నుంచి తప్పించండి

కణేకల్లు , ఆగస్టు 22: పాఠశాలల్లో మరుగుదొడ్లను ఫొటో తీసే బాధ్యతలు నుంచి తమను తప్పించాలని మండలంలోని సచివాలయ ఉద్యోగులు కోరారు. ఈ మేరకు మండల కేంద్రంలో గురువారం ఎంపీడీఓ శ్రీనివాసులును కలిసి వినతిపత్రం అందించారు. పలువురు మాట్లాడుతూ సచివాలయంలో పని చేస్తూ అదనపు పనులు చేయడం భారంగా మారుతుందని వాపోయారు. పాఠశాలల్లో మరుగుదొడ్లను ఫొటో తీసే బాధ్యతలు నుంచి తప్పించాలని కోరారు.

బహిరంగ ప్రకటన
ఇందుమూలంగా యావన్మందికి తెలియ జేయడమేమనగా నా క్లయింట్ అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, బ్రాంచ్-2 అనంతపురం వారు పి.కన్నెప్ప W/o పి.మారుతి అను పేరున గల ఆస్తి తాకట్టుపై పి.మారుతి S/o P.చిన్న లింగప్ప D.No.3-427, సదాశివన్ కాలనీ, అనంతపురం వారికి ఋణం ఇవ్వదలచుకున్నారు దీనిపై ఎవ్వరికైనా అభ్యంతరాలు, తకరార్లు ఉన్న యెడల7 రోజుల లోపు నాకు గానీ నా క్లయింట్‌కు గానీ తెలుపగలరు.
షెడ్యూలు
అనంతపురం రి॥డి॥ కళ్యాణదుర్గం సబ్ రి॥డి॥కి చేరిన శెట్టూరు మండల కేంద్ర పరిధిలోని సర్వేనెం.210-1Cలో 120.33 చ॥గ॥లు.
చెక్కుబందీ:తూర్పు: రోడ్డు, పడమర: ఉప్పర గురునాథ ఖాళీ స్థలం, ఉత్తరం: ఇదే సర్వేనెంబరులో ఉప్పర ధనుంజయ మిగిలిన భూమి, దక్షిణం: మజుల కు అమ్మిన ఖాళీ స్థలం.
Y.రామేశ్వర రెడ్డి, అడ్వకేట్, ATP Cell:9440565907

బహిరంగ ప్రకటన
ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడమేమనగా నా క్లయింట్ అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, బ్రాంచ్-2 అనంతపురం వారు క్రింది తెలిపిన ఆస్తి తాకట్టుపై పాయసం శివశంకర్ రెడ్డి S/o పాయసం రంగారెడ్డి, నాగసముద్రం గ్రామం, గుంతకల్ మండలం, అనంతపురం జిల్లా వారికి ఋణం ఇవ్వదలచుకున్నారు దీనిపై ఎవ్వరికైనా అభ్యంతరాలు, తకరార్లు ఉన్న యెడల7 రోజుల లోపు నాకు గానీ నా క్లయింట్‌కు గానీ తెలుపగలరు.
షెడ్యూలు
అనంతపురం రి॥డి॥ పామిడి సబ్ రి॥డి॥కి చేరిన పామిడి మండల కేంద్ర పరిధిలోని సర్వేనెం.522/A3లో 244.44 చదరపు గజాలు.
చెక్కుబందీ:తూర్పు: 16అడుగుల వెడల్పు రోడ్డు, పడమర: రామక్రిష్ణారెడ్డి స్థలం, ఉత్తరం:ఇదేనెం.లోనా యొక్క మిగులు స్థలం, దక్షిణం: ఇతరుల స్థలం.
Y.రామేశ్వర రెడ్డి, అడ్వకేట్, ATP Cell:9440565907

బహిరంగ ప్రకటన
ఇందుమూలంగా యావన్మందికి తెలియ జేయడమేమనగా నా క్లయింట్ అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, బ్రాంచ్-2 అనంతపురం వారు క్రింది తెలిపిన ఆస్తి తాకట్టుపై మాదిగ శివకుమార్ S/o మాదిగ వన్నూరప్ప, D.No:28-2-448-1, నవోదయ కాలనీ, అనంతపురం వారికి ఋణం ఇవ్వదలచుకున్నారు దీనిపై ఎవ్వరికైనా అభ్యంతరాలు, తకరార్లు ఉన్న యెడల7 రోజుల లోపు నాకు గానీ నా క్లయింట్‌కు గానీ తెలుపగలరు.
షెడ్యూలు
అనంతపురం రి॥డి॥ అనంతపురం రూరల్ సబ్ రి॥డి॥కి చేరిన రాప్తాడు మండలం ప్రసన్నాయపల్లి గ్రామ పంచాయతీ పరిధి, లోని సర్వేనెం.59/4 లో ప్లాట్ నెం.77.
చెక్కుబందీ:తూర్పు: ప్లాట్ నెం.78, పడమర:సాకే మస్తాన్ బాబుకు అమ్మిన ప్లాటు, ఉత్తరం: 20అడుగుల రోడ్డు, దక్షిణం: ప్లాట్ నెం.87.
Y.రామేశ్వర రెడ్డి, అడ్వకేట్, ATP Cell:9440565907

ప్రకటన
వై.పెద్ద ఎర్రిస్వామి S/o వై.ఎర్రప్ప, D.No.8-204,పాతబస్టాండు, కళ్యాణదుర్గం, అనంతపురం జిల్లా. Doc.No.3792/2007, సర్వే నెం.333-1Cలో ఖాళీ స్థలంను శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్ రాయదుర్గం బ్రాంచ్ నందు తాకట్టు పెట్టడం జరుగుచున్నది. ఎవరికైనా అభ్యం తరాలు, తకరార్లు ఉన్నచో 7 రోజుల లోపు రాయదుర్గం శ్రీరామ్ ఫైనాన్స్ బ్రాంచ్ మేనేజర్‌ను సంప్రదించండి.
హద్దులు:తూర్పు:ప్లాట్ నెం.32, పడమర: కళ్యాణదుర్గం-బెలుగుప్ప రోడ్డు,ఉత్తరం:చిన్న ఎర్రిస్వామికి చెందిన మిగిలిన ప్లాటు, దక్షిణం: ప్లాట్ నెం.32
K.మల్లికార్జున, అడ్వకేట్, కళ్యాణదుర్గం